నవతెలంగాణ
ఆదిలాబాద్
1
మంగళవారం | నవంబర్ 05, 2024 | www.navatelangana.com

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-తాంసి

మండల సమైక్య కార్యాలయాల్లో వీఓఏలుగా పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం భీంపూర్ మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షులు దర్శనాల అరుణ్ మాట్లాడుతూ వీఓఏలకు పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని, ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం గ్రామ సంఘం నుండి రావాల్సిన రూ.3వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫోన్‌లు సపోర్ట్ చేయకపోవడంతో ఆన్‌లైన్ పనులు చేయలేకపోతున్నారని, వెంటనే ల్యాప్‌ట్యాప్‌లు ఇవ్వాలని తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐకెపి కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పుర్క దాంజి, ఉపాధ్యక్షులు ప్రమోద్, కోశాధికారి పొచ్చక్క పాల్గొన్నారు.

జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్‌టౌన్ : జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఆర్ ప్రైమ్ పాఠశాలలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల నెట్ బాల్ ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలను అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌతం, సంస్థ జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర పోటీల్లో జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలిపేలా క్రీడాకారులంత కృషి చేయాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8 నుంచి 10 వరకు నిర్మల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పెటా సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.స్వామి, పోటీల ఆర్గనైజర్ హరీష్, పీఈటీ రూపేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.



సన్నగిల్లుతున్న ఆశలు..!

- వరి సాగులో సగానికి పడిపోయిన దిగుబడి
- అధిక వర్షాలు, దోమపోటుతో నష్టాలు
- సగం దిగుబడి కూడా రాదంటున్న రైతులు
- బియ్యానికి పెరగనున్న డిమాండ్

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగైంది. ఇందులో సింహభాగం రైతులు సన్న రకం వరి సాగు చేశారు. కానీ వారికి ఈ పంటకు వాతావరణం అనుకూలించక దోమపోటు, తెగుళ్లు సోకి చివరకు దిగుబడి సగానికి పడిపోయింది. గతంలో ఎకరాకు సుమారు రెండు ట్రాక్టర్ల ధాన్యం దిగుబడి రాగా ప్రస్తుతం ఒక ట్రాక్టర్ కూడా పూర్తిగా నిండడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కౌలు, పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదంటున్నారు. పండిన కాస్త సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.3200 చెల్లించి కొనుగోలు చేస్తేనే రైతులు బతికి బట్టకట్టేదంటున్నారు. దేశంలో ఇతర రాష్ట్రాల్లో అధిక వర్షాలతో పంటలు పూర్తిగా దెబ్బతిన్న పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లాలో మొన్నటి వరకు ఆశాజనకంగా ఉన్న చివరి దశలో పంట నష్టం వాటిల్లింది. దీంతో బియ్యానికి డిమాండ్ పెరిగే అవకాశం ఉంది.



నవతెలంగాణ-హాజీపూర్

ఖరీఫ్‌లో కాస్త ఆలస్యంగా వానకాలంలో మంచి వర్షాలు కురిశాయి. అధికారుల సూచన మేరకు రైతులు పంటలు సాగు చేశారు. దాదాపు 1.60లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో 80శాతం సన్నరకం ధాన్యం పండించారు. తెలంగాణ సోనా, బీపిటీ, ఆర్‌ఎన్‌ఆర్, జైశ్రీరామ్, సాయిరాం, హెచ్‌ఎంటి తదితర రకాలు సాగు చేశారు. పంటలు చేతికి వచ్చే సమయంలో దోమపోటు ఆశించింది. అధిక వర్షాలతో ఇతర తెగుళ్ల కూడా సోకాయి. ఫలితంగా దిగుబడి సగానికి పడిపోయిందని రైతులు అభిప్రాయపడుతున్నారు. తద్వారా గింజ నాణ్యత కూడా లోపించింది. తెగులుతో కొన్ని ప్రాంతాల్లో పొలాల్లో గింజలపై పసుపు వర్ణంలో కాయల రూపంలో ఏర్పడింది. పురుగు ఆకులను మేసి దిగుబడిపై ప్రభావం చూపిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో సన్నరకం సాగుచేసిన రైతులు మొదట పైరు ఏపుగా పెరగడంతో సంతోష పడ్డారు. కానీ పంట చేతికి వచ్చే సమయంలో దోమపోటు ఆశించడంతో దిగాలు చెందారు. కోసే దశలో రెండు మూడు సార్లు దోమ మందు పిచికారి చేసి ఆర్థికంగా నష్టపోయారు. కానీ దిగుబడి మాత్రం సగమే రావడంతో నిట్టూరుస్తున్నారు. కాస్తో కూస్తో రోగాలను, దోమను తట్టుకుని ఉన్న పొలాల్లో కూడా దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

సన్నరకానికి రూ.3200 చెల్లించాలని డిమాండ్

ఇన్ని వ్యయప్రయాసాలతో కూడి సన్నరకం ధాన్యం పండించిన రైతులకు దిగుబడి సగానికి పడిపోయింది. ఆ పండిన ధాన్యాన్ని ఇప్పుడు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.3200 చెల్లించి కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది కౌలుతో పాటు పెట్టుబడులు కూడా మిగిలే అవకాశం లేదని, ప్రభుత్వం ధర పెంచితే కనీసం పెట్టుబడులైనా వచ్చే అవకాశముందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వచ్చే ఏడాది నుండి రేషన్ షాపుల్లో సన్నరకం బియ్యం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో వర్షాకాలంలో పంటల సాగు నుంచి ప్రభుత్వం సన్నరకం సాగు చేయాలని చెబుతూ వచ్చింది. కానీ మద్దతు ధరపై ఇప్పటికి స్పష్టత ఇవ్వడం లేదని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటి పరిస్థితుల్లో ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని, లేని యెడల ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బియ్యానికి పెరగనున్న డిమాండ్

ఈ ఏడాది దేశంలో అధిక వర్షాల నేపథ్యంలో పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళలో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మన రాష్ట్రంలో కూడా ఖమ్మం, నల్గొండ జిల్లాలో పంటలు నీట మునిగి నష్టం జరిగింది. ఇక మిగిలింది ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్‌లో మాత్రమే సన్న రకం సాగు చేశారు. వారం క్రితం కురిసిన వానలతో ఇక్కడ కూడా పంట నష్టం జరిగింది. దీంతో ఈ ఏడాది బియ్యం ధరలు పెరిగే అవకాశముంది. ఈ పాటికే తమిళనాడు నుండి కొన్ని విత్తన కంపెనీలు మంచిర్యాల జిల్లాకు వచ్చి సన్నరకం ధాన్యం విత్తనాల కోసం కొనుగోలుకు ముందే ఒప్పందాలు చేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో బియ్యం ధర రూ.7వేలకు చేరే అవకాశముంది. వర్షాలు, దోమపోటు ఇతర రోగాలతో మిగిలిన పంట కాస్త పొరుగు రాష్ట్రం నుండి వస్తున్న కంపెనీలు కొనుగోలు చేస్తే ఇక్కడ బియ్యం ధరలకు రెక్కలు రానున్నాయి.

పెట్టుబడి కూడా రాదు : దొమ్మటి రవి, నమ్నూర్



నేను 4 ఎకరాల్లో వరి సాగు చేశాను. మొత్తం సన్నరకం సాగు చేశాను. గతేడాది ఖరీఫ్‌లో ఎకరాకు రెండు ట్రాక్టర్ల ధాన్యం దిగుబడి రాగా ఇప్పుడు ఒక ట్రాక్టర్ చొప్పున కూడా పండలే. ఇందులో నుండి కౌలు, పెట్టుబడి పోను నాకు ఏమీ మిగలవు. పండిన ధాన్యాన్ని ప్రభుత్వమే క్వింటాల్‌కు రూ.3200 చెల్లించి కొనుగోలు చేయాలి. లేకుంటే బతుకు కష్టంగా మారుతుంది. పంటపై దోమపోటు, తెగులు ఆశించి దిగుబడిపై ప్రభావం చూపాయి. పురుగుమందులు పిచికారితో పెట్టుబడి పెరిగింది. చివరకు రెక్కల కష్టం కూడా మిగిలే పరిస్థితి కనిపించడం లేదు.

ఫిర్యాదుదారులకు సహకరించాలి



నవతెలంగాణ-హాజీపూర్

పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సహకరించాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బందిని ఉద్దేశించి పలు సూచనలు చేశారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని, ఫిర్యాదులు రాయించి సహకరించాలని సూచించారు. 100 డయల్ సత్వరమే స్పందించాలన్నారు. బ్లూ కోర్టు సిబ్బంది నిత్యం గస్తీలో ఉండాలని ఆదేశించారు. గంజాయి, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ ప్రకాశ్, రూరల్ సీఐ అశోక్, ఎస్సై గోపతి సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

నవతెలంగాణ-ముధోల్

విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించాలని మండల విద్యాధికారి రమణారెడ్డి అన్నారు. ఎంపీడీఓ సమావేశ మందిరంలో సోమవారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటలలో సైతం ముందుండేలా చూడాలని పేర్కొన్నారు. యుడైస్, అపార్‌ను అప్డేట్ చేయించాలని సూచించారు. విద్యార్థుల అభ్యాసన ప్రక్రియను వెలికితీసి పిల్లలు విద్య పట్ల ఆకర్షితులయ్యే విధంగా కృషి చేయాలన్నారు. ఈడీఎన్ యాప్‌లో మార్కులను క్రోడీకరించాలని సూచించారు. గ్రంథాలయ పీరియడ్‌ను ప్రతి పాఠశాలలో ఉంచి ప్రభుత్వం అందించిన వివిధ పుస్తకాలను చదివించాలన్నారు. డిసెంబర్ 4న కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఎన్ఎఎస్ పరీక్షకు 3,6,9 తరగతుల విద్యార్థులను సన్నద్ధ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నరసింహచారి, అమీర్ కుసురు, మోహినోద్దీన్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం దళారులకు విక్రయించి మోసపోవద్దు

నవతెలంగాణ-సారంగాపూర్

వరి ధాన్యం దళారులకు విక్రయించి మోసపోవద్దని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది అన్నారు సోమవారం మండలంలోని స్వర్ణ, పొట్యా గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ఏ గ్రేడ్ క్వింటాల్‌కు రూ.2320, బి గ్రేడ్‌కు రూ.2300 మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మయారాం, పలువురు రైతులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-ముధోల్

జిల్లా కేంద్రంలో ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 బాలుర కబడ్డీ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ముధోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి వినయ్ జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆదిలాబాద్‌లో జరిగే జోనల్ స్థాయి అండర్-17 కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

భీంసరి గ్రామస్తులకు పెన్షన్ మంజూరు చేయాలని వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ మండలం భీంసరి గ్రామానికి చెందిన వితంతువులకు, వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్ మంజూరు చేయాలని మాజీ ఎంపీటీసీ బిక్కి గంగాధర్ కోరారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ రాజర్షి షాకు ప్రజావాణిలో బాధితులతో కలిసి విన్నవించారు. గ్రామంలో 50 మందికిపైగా లబ్ధిదారులు ఉన్నారన్నారు. ఐదు సంవత్సరాలుగా వీరికి పెన్షన్ రావడం లేదని వాపోయారు. ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ పెన్షన్ మంజూరు కాలేదన్నారు. అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు.

బౌద్ధులుగా మారినా ఎస్సీ రిజర్వేషన్ మారదు

నవతెలంగాణ-ఉట్నూర్

బౌద్ధులుగా మారినా షెడ్యూల్ క్యాస్ట్ రిజర్వేషన్ మారదని భారతీయ బౌద్ధమహాసభ తెలంగాణ రాష్ట్ర మండల అధ్యక్షుడు ప్రభాకర్ గడపాలె అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఊర్వెల బుద్ధ విహారలో భారతీయ బౌద్ధమహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞాకుమార్, జిల్లా కోశాధికారి కేంద్రీయ శిక్షక్ కాంతారావు వాఘ్మారే ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో మతం అనే విభాగంలో బౌద్ధ మతం చేర్చాలని కోరారు. షెడ్యూల్డ్ కులాల వారు బౌద్ధులుగా మారినా వారికి షెడ్యూల్ కులం(ఎస్సీ) రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వ జీవో జారీ చేసిందని తెలిపారు. కార్యక్రమంలో మాల సంఘం పట్టణ అధ్యక్షులు బొంకంటి సుభాష్, మహర్ బెటాలియన్ నాయకులు కాంబ్లే ప్రజ్ఞశీల్, నేతకాని యువసేన జిల్లా నాయకులు జాడి వెంకటేష్ పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నిర్మల్‌రూరల్ : మండలంలోని వెంగ్వాపేట్ గ్రామంలో సోమవారం పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోషల్ మీడియా ఇన్‌చార్జిగా రవిరాజ్

బోథ్: పీఆర్‌టీయూ మండల సోషల్ మీడియా ఇన్చార్జిగా రవిరాజ్‌ను నియమించామని పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు ఆర్‌టీవీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సంగు స్వామి తెలిపారు. ఈ సందర్భంగా రవిరాజ్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో బాధ్యతలు అప్పజెప్పినందుకు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయనను ఉపాధ్యాయులు సన్మానించారు.

జర్నలిస్ట్ కుటుంబానికి జోగు పరామర్శ

ఆదిలాబాద్‌టౌన్: మాజీ జర్నలిస్ట్, గోపాలం చిత్ర దర్శకుడు షఫీ ఉల్లాఖాన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు. సోమవారం పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. షఫీఉల్లాఖాన్ సినీ, పాత్రికేయ రంగంలో చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు మెట్టు ప్రహ్లాద్, యూనీస్ అక్బానీ, రొకండ్ల రమేష్ ఉన్నారు.

రైతు విగ్రహావిష్కరణకు ఆహ్వానం

నిర్మల్ రూరల్ : తిమ్మాపూర్, ఖానాపూర్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న ఆదివారం నిర్వహించే రైతు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా కోరుతూ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌కు ఆహ్వాన పత్రికను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘ సభ్యులు, కౌన్సిలర్లు పూదరి రాజేశ్వర్, అడ్ప పోశెట్టి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం బీజేపీకి లేదు

- బీజేఎల్‌పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

కేబినెట్‌లో విభేదాలు, కాంగ్రెస్‌లో కుమ్ములాటలను కట్టడి చేయలేని సిఎం రేవంత్‌రెడ్డి తమ లోపాలను, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్‌ఎస్‌తో కలిసి బీజేపీ కూల్చేందుకు ప్రయత్నిస్తోందంటూ తప్పుడు ఆరోపణలు చేయించడం ముఖ్యమంత్రి దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని బీజేఎల్‌పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీఆర్‌ఎస్, బీజేపీ కుమ్మక్కయ్యాయంటూ మంత్రి శ్రీధర్‌బాబు అవగాహన లేకుండా నిరాధార ఆరోపణలు చేశారన్నారు. మధ్యప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రలో కాంగ్రెస్ కూటమి ప్రభుత్వాలు అంతర్గత కుమ్ములాటలతో కూలిపోయాయే తప్ప అందులో బిజెపి ప్రమేయం ఏమాత్రమూ లేదన్నారు. ముఖ్యమంత్రులను మార్చిన ట్రాక్ రికార్డు ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు కూడా రేవంత్‌రెడ్డిని మార్చి మరో సీనియర్ మంత్రిని సిఎంను చేయడానికి కసరత్తు చేస్తున్నట్లు సమాచారముందని తెలిపారు. ఇదే విషయాన్ని మీడియాతో మాట్లాడానని, ఇందులో ప్రభుత్వాన్ని పడదోసే వ్యూహం మంత్రి శ్రీధర్‌బాబుకు కనిపించడం ఆయన దృష్టి లోపమని తెలిపారు. కేబినెట్‌లో ఆరుగురు మంత్రులు ఒక గ్రూపుగా, సిఎంతో సహా టిడిపి, బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన మిగిలిన ఆరుగురు మరో గ్రూపుగా విడిపోలేదా? మంత్రి మండలి ఇలా నిలువునా చీలిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌తో కుమ్మక్కైంది కాంగ్రెస్సే అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, ధరణి పోర్టల్, మిషన్ భగీరథ, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, ఫోన్ ట్యాపింగ్ వంటి భారీ అవినీతి, అక్రమాలకు సంబంధించిన కేసుల్లో ఇప్పటి వరకు ఒక్క బీఆర్‌ఎస్ నేతను కూడా అరెస్టు చేయకపోవడం వెనక మతలబేంటని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌తో అసలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ ఈ చీకటి ఒప్పందాన్ని కప్పిపుచ్చుకునేందుకు బీఆర్‌ఎస్, బిజెపి కలిసి కాంగ్రెస్ సర్కారును కూల్చాలని చూస్తున్నాయంటూ మంత్రి శ్రీధర్‌బాబు నిరాధార ఆరోపణలు చేయడం విడ్డూరమని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాక, కాంగ్రెస్‌లో ఉన్న కుమ్ములాటలను కట్టడి చేసుకోవడం సాధ్యం కాక, ఇలా ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నాలు సాగుతున్నాయంటూ బిజెపిని బద్నాం చేయడం, తద్వారా ప్రజల నుంచి కాంగ్రెస్ సానుభూతి పొందాలని చూడడం ముమ్మాటికీ కుట్ర పూరితమేనని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డికి చాతనైతే కేబినెట్‌లో విభేదాలు, కాంగ్రెస్‌లో కుమ్ములాటలు లేకుండా చేసుకోవాలి తప్ప బిజెపిని బద్నాం చేయడం కాదని తెలిపారు.

10, 11 తేదీల్లో టీయూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) 6వ రాష్ట్ర విద్యా మహాసభలను ఈనెల 10, 11 తేదీలల్లో జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ లచ్చిరాం తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ జిల్లా కార్యవర్గ సభ్యులతో కలిసి సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీయూటీఎఫ్ ఆవిర్భావం తర్వాత మొట్టమొదటిసారిగా జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నందున పాత ఆదిలాబాద్ జిల్లాకు చెందిన నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మహాసభల్లో అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపాల్సి ఉన్నందున స్థానిక ఉపాధ్యాయ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అన్ని మండలాలలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు బేర దేవన్న, రాష్ట్ర సహాధ్యక్షురాలు ఆర్.సుజాత, రాష్ట్ర కమిటీ సభ్యులు నారాయణ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి : కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని వెంటవెంటనే లారీలలో లోడ్ చేయించి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయి సిబ్బంది మొదలుకుని అధికారుల వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో సరిపడినన్ని తూకపు, తేమ యంత్రాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. టార్పాలిన్, ధాన్యపు బస్తాలను కేంద్రాలలో అందుబాటులో ఉంచాలని సూచించారు. తూనికలు కొలతల శాఖ తూకపు యంత్రాలకు స్టాంపింగ్ చేసి సంబంధిత సర్టిఫికెట్లను అందజేయలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఎం సివిల్ సప్లయిస్ వేణుగోపాల్, ఏడి మార్కెటింగ్ శ్రీనివాస్, డిఆర్డిఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో కృత్రిమ మేధస్సుపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-ముధోల్

ఆర్జీయూకేటీ బాసర ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసర్చ్ చండీగఢ్ సంయుక్తంగా వారం రోజులపాటు ఇంజనీరింగ్ విద్యలో కృత్రిమ మేధస్సు అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ సహకారంతో అధ్యాపకులు, విద్యార్థులకు కృత్రిమ మేధస్సుపై సదస్సు నిర్వహించడం గొప్ప పరిణామమని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి తెలిపారు. కృత్రిమ మేధస్సు ఇంజనీరింగ్ రంగాలలో ఏ విధంగా ఉపయోగపడుతుందన్న అంశంపై, ప్రాజెక్టు నిర్వహణ వనరుల కేటాయింపులో కృత్రిమ మేధస్సును వాడటం, భద్రతా వ్యవస్థలు, డిజైన్ టూల్స్ తయారీ, ఆటోమేషన్ ఇంజనీరింగ్ రోబోటిక్స్‌లో ఏఐ పాత్ర, పర్యావరణ అనుకూల పద్ధతులు ప్రోత్సహించడంలో ఏఐ స్థానం తదితర అంశాల గూర్చి సదస్సులో ఆచార్యులు, ప్రత్యేక నిపుణుల ద్వారా చర్చ జరుగుతుందని సమన్వయకర్త డాక్టర్ రాకేష్ నామాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లు నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైస్ మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి ఖరీఫ్ ధాన్యం కొనుగోలు, అండర్ టేకింగ్, బ్యాంక్ గ్యారంటీ, బియ్యం మిల్లింగ్ అంశాలపై సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో 34 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ నెల 15 తర్వాత ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రైస్ మిల్లర్లు అండర్ టేకింగ్, బ్యాంకు గ్యారంటీలను నిర్ణీత గడువులోగా అందజేయాలని, కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు వచ్చే ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకొని వాహనాలను తిరిగి పంపించాలని తెలిపారు. ధాన్యం మిల్లింగ్ చార్జీలు ఒక క్వింటాల్ దొడ్డు రకం ధాన్యానికి రూ.40, సన్న రకం ధాన్యానికి రూ.50 చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం మిల్లింగ్ ప్రక్రియలో రైస్ మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించిన రైసు మిల్లులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాలు, వ్యవసాయ, సహకార, ఐకెపి, రవాణా శాఖల అధికారులు, రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | నవంబర్ 05, 2024 | www.navatelangana.com

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని తంతోలి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త గుంజాల రమేష్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన ఎడుమేకల చిన రాజేశ్వర్ గుండెపోటుతో, జక్కుల రమేష్ పాము కాటుతో మరణించారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, ఆదిలాబాద్ రూరల్ మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్



అల్చెట్టి నాగన్న, నాయకులు మంచాల పోతన్న, మొహమ్మద్ రఫీక్, అశోక్, షేక్ షాహిద్, మాజీ ఉపసర్పంచ్ ఎడుమేకల రాజేశ్వర్ యాదవ్, భీమనవేణి వీరయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ భీమనవేణి వెంకట్ యాదవ్, గజ్జి వెంకన్న, పొన్నారి రాములు, నక్కల దత్తు, భీమనవేణి రవి, కొండూరి భాస్కర్, వినోద్ పాల్గొన్నారు.

రైతులు పత్తిని సీసీఐకి అమ్ముకోవాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రైతులు తాము పండించిన పత్తి పంటను సీసీఐకి అమ్ముకొని లాభపడాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మిట్టల్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ కొనుగోలు ప్రారంభించారు. సీసీఐలో రైతులకు కనీస మద్దతు ధర క్వింటాల్ కు రూ.7,525కు కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు బయట దళారులకు అమ్మి నష్టపోకుండా ప్రభుత్వ రంగ సంస్థ అయిన సీసీఐలో అమ్ముకోవాలన్నారు. అనంతరం కేస్లాపూర్‌లో దండారీలకు ప్రభుత్వం తరపున రూ.15వేల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు ముఖాడే ఉత్తం, దుద్‌రాం, సోమూరే నాగోరావ్, శ్రీకాంత్, సుంకట్ రావ్, మార్కెట్ కార్యదర్శి దేవన్న, నరేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



త్రీఫేజ్ కరెంట్ సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని వాయిపేట్ గ్రామపంచాయతీ పరిధిలోని చిమ్మన్ గుడి, చింతగూడ, రాంనగర్, భీంపూర్ గ్రామాలకు త్రీఫేజ్ కరెంట్ సౌకర్యం కల్పించాలని సోమవారం ఉట్నూర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. త్రీఫేజ్ కరెంట్ సౌకర్యం లేకపోవడం వల్ల వ్యవసాయ సాగు కోసం ఇబ్బందిగా మారిందని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో మాత్రమే పంటలు సాగు చేస్తున్నామని, మిగతా సమయంలో పంటలకు నీరు ఇవ్వాలంటే కరెంట్ సౌకర్యం తప్పనిసరి కావాల్సి ఉందని అన్నారు. అటవీ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణను కూడా కలిసి త్రిఫేజ్ కరెంట్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఇమామ్, నాయకులు, గ్రామస్తులు అనిల్ కుమార్, మంతు పటేల్, బారిక్‌రావ్, ప్రకాష్, గోపాల్, గంగాధర్ పాల్గొన్నారు.

తేమ మినహాయింపుతో పత్తికి ధర ఇవ్వాలి

- రెండు విడతల రైతు భరోసా డబ్బులు ఇవ్వాలి
- అఖిల పక్ష రైతు సంఘాల నాయకుల డిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పత్తిలో తేమను పూర్తిగా మినహాఇస్తూ మద్దత్తు ధర ఇవ్వాలని రెండు విడతల రైతు భరోసా రైతుల ఖాతాలో వేయాలని, అఖిల పక్ష రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల పక్ష రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక సాగు అయ్యే పత్తి పంట రైతు మార్కెట్‌లో తన పంట అమ్మే సందర్భంగా తీవ్ర దోపిడీకి గురవుతున్నారని అన్నారు. మార్కెట్ అధికారులు సీసీఐ, ప్రయివేట్ వ్యాపారులు కుమ్మక్కై రైతులను నట్టేట ముంచుతున్నారని మండిపడ్డారు. మార్కెట్ ప్రారంభమై ఎనిమిది రోజులు గడుస్తున్న పత్తికి మద్దత్తు ధర ఇప్పించడంలో అధికార పార్టీ, ఎమ్మెల్యేలు అధికారులు పూర్తిగా విఫలమయ్యారని రైతులను పూర్తిగా దగా చేస్తూ, మద్దతు ధర లేకుండా పత్తి కనుగొళ్ల చేపడుతున్నారని దుయ్యాబట్టారు. తక్షణమే ఎలాంటి తేమ షరతులు లేకుండా మద్దత్తు ధరతో పత్తిని కొనాలని దానికోసం కేంద్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగం ఎమ్మెల్యే, ఎంపీలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ఇస్తామని, హామీ ఇచ్చిన ప్రకారం ఎకరానికి రూ.15 వేల చొప్పున రెండు విడతల రైతు భరోసా డబ్బులను రైతుల ఖాతాలో వేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకై రైతులతో కలిసి మండలాల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్టు ప్రకటించారు. సమావేశంలో నాయకులు రోకండ్ల రమేష్, కొండ రమేష్, లోకారి పోశెట్టి, లక్ష్మణ్, లంక రాఘవులు, వెంకట్ నారాయణ, జగన్, సురేష్, పూసం సచిన్, స్వామి పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తాం



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ప్రజల సమస్యలను పరిష్కారిస్తామని ఐటీడీఏ ఏఓ దామోదరస్వామి సంబంధిత అధికారులకు తెలిపారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. జైనథ్ గ్రామానికి చెందిన రాము తనకి భూమి పట్టా మంజూరు చేయాలని కోరారు. ఆదిలాబాద్ మండలం దోతిగూడ గ్రామానికి చెందిన దేవరావ్ తమ గుస్సాడి కొరకు డబ్బులు మంజూరు కొరకు, ఇంద్రవెల్లి మండలం ఇంద్రవెల్లి గ్రామానికి చెందిన మౌనిక ఏఎన్ఎం ఉద్యోగం ఇప్పించాలని కోరారు. పింఛన్, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో ఏపీఓ మెస్రం మనోహర్, ఐసీడీఎస్ రమాదేవి, జెడీఎం నాగభూషణం, వసంతరావు, డీపీఓ ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-తాంసి

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన కుటుంబ సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించే బాధ్యత మన అందరిపై ఉంటుందని ఎంపీడీఓ మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని హైస్కూల్లో నిర్వహించిన సమగ్ర సర్వే సిబ్బందితో శిక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన సర్వేలో పొందపరిచిన అన్ని వివరాలను తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6నుంచి నిర్వహించే సమగ్ర సర్వేలో పాల్గొనే సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. సర్వేలో కుటుంబంలోని యజమాని లేదా కుటుంబానికి సంబంధించిన వ్యక్తి ఉంటే సరిపోతుంది. ఆ వ్యక్తి కుటుంబానికి సంబంధించిన అన్ని వివరాలను అడిగి ఇచ్చిన వివరాలను మాత్రమే నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబాన్ని తప్పకుండా సర్వే చేయడం మన బాధ్యతగా తీసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, ఎంఈఓ శ్రీకాంత్, ఎంపీఓ లింగయ్య సిబ్బంది ఉన్నారు.

సీఐటీయూ భవన ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

కార్మిక పోరాటాల సారథి ఐక్య ఉద్యమాల వారధి సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా కార్యాలయం బాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రం ఈ నెల 28న ప్రారంభించనున్నట్టు సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ప్రారంభ సభ కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. జిల్లా కార్మికవర్గం, ఉద్యోగులు, ప్రజానీకం, రైతాంగం అధిక సంఖ్యలో ప్రారంభ సభకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ భవనాన్ని మాజీ పార్లమెంటు సభ్యులు బృందా కరత్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించనున్నట్టు తెలిపారు. అతిథులుగా సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం. సాయిబాబు, ఆదివాసీ హక్కుల చట్టం రూపకర్త మాజీ పార్లమెంటు సభ్యులు మీడియం బాబురావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పి.జయలక్ష్మి, కూరపాటి రమేష్ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్ హాజరవుతున్నట్లు తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు, పోరాటాలను నిర్మించేందుకు భవిష్యత్తు ఉద్యమాల రూపకల్పనకు బాసెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రం వేదిక కానుందని అన్నారు. ఈ సభకు జిల్లా కార్మికవర్గం, ప్రజానీకం అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, నాయకులు పోతరాజు రాజేశ్వర్, అనేం రవి, ఉశన్న, నర్సుబాయి, పరుశురామ్, లక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలలకు ఒక పూట సెలవులు ప్రకటించడం సరికాదు



నవతెలంగాణ-ఉట్నూర్

కులగణన పేరుతో రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు 15 రోజులపాటు ఒకపూట సెలవులు ప్రకటించడం సరికాదని టీటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ రవీందర్ అన్నారు. సోమవారం సబ్‌కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఒకపూట సెలవులతో ప్రభుత్వ ప్రాథమిక విద్యావ్యవస్థ మరింత దిగజారిపోతుందని అన్నారు. తల్లిదండ్రులు ఉదయం పూట విద్యార్థులను పాఠశాలల్లో వదిలి కూలీ పనులకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం పూట వదిలివేయడంతో విద్యార్థులభద్రత ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. ఈ నెలలోనే నేషనల్ ఆచివ్ మెంట్ సర్వే ఉందని, దీనికోసం విద్యార్థులను సంసిద్ధత చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీటీఎఫ్ నాయకుడు జాదవ్ పవన్‌లాల్ పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అర్జీల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఆయన పాల్గొని అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యలపై ప్రజలు ఇచ్చిన వాటిని ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిష్కారించేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన ఆర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కారించాలని, పెండింగ్‌లో పెట్టోద్దన్నారు. కాగా మొత్తం అర్జీదారుల నుంచి 84 అర్జీలను స్వీకరించినట్టు పేర్కొన్నారు. ఇందులో పంచాయతీ, వ్యవసాయం, రెవిన్యూ, మహిళా శిశుసంక్షేమశాఖ, విద్యా, వైద్య పెన్షన్, తదితర శాఖల కు సంబందించిన దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, జిల్లా అధికారులు, రెవెన్యు సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగులకు ఆసరా పెన్షన్ అమలు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వికలాంగులకు ప్రకటించిన అన్ని పథకాలతో పాటు ఆసరా పెన్షన్ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలను వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సూర్యవంశీ సుజాత అన్నారు. పెన్షన్ పెంపు సాధన కోసం సోమవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం అంబేద్కర్ భవన్‌లో చేయూత పెన్షన్ దారుల మహాసభ ఏర్పాటు చేశారు. సమితి జిల్లా అధ్యక్షులు కల్లేపెల్లి ప్రేమ్‌రాజ్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటిన చేయూత పెన్షన్ దారులకు పెంచిన పెన్షన్లను ఇవ్వలేదన్నారు. వారం రోజుల్లో 10 నెలల చేయూత పెన్షన్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోతే హామీలను అమలు చేయకపోతే ఉద్యమాన్ని గల్లి నుంచి రాజధాని హైదరాబాద్ వరకు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నవంబరు 16 వరకు రోజుకు రెండు జిల్లాల వారీగా పెన్షన్ దారుల మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభలు ముగియకముందే రాష్ట్ర ప్రభుత్వం మహామీలను అమలు చేయకపోతే 17 తేదీ నుంచి 23వ తేదీ వరకు అన్ని జిల్లాల కలెక్టర్ల కార్యాలయాల ముందు రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తామన్నారు. అప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెన్షన్లను ఇవ్వకపోతే నవంబర్ 26న పెన్షన్ దారుల పోరాట దినంగా ప్రకటించి, చేయూత పెన్షన్ దారులందరినీ, రాజకీయ అఖిలపక్షాలను కూడా ఇందులో భాగస్వామ్యం చేసి చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తామని తెలిపారు. అదే రోజు ఇందిరా పార్క్ వద్ద వికలాంగుల మహా గర్జన పేరుతో లక్షలాది వికలాంగులతో మహా ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్, సిండే ప్రమోద్ కుమార్, వీహెచ్‌పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ ఉపాధ్యక్షులు జాంలే నాందేవ్, కలువ సగన, వీహెచ్‌పీఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు కనక కిషన్, అజర్ సుధవ్వ, కృష్ణ, తుమ్మల రాజారెడ్డి ఉన్నారు.

గిరిజన క్రీడోత్సవాల ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని, మంగళవారం ఉదయం పది గంటలకు క్రీడా పోటీలు ప్రారంభించడం జరుగుతుందని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా అన్నారు. రాష్ట్ర స్థాయిలో 33 జిల్లాల గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న బాలబాలికలు 1600 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొననున్నారని, 300 మంది కోచ్‌లు వస్తున్నారని తెలిపారు. నవంబర్ 5, 6, 7 తేదీలలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయిలో జరుగు గిరిజన క్రీడోత్సవాల్లో అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, క్యారమ్, కబడ్డీ, ఆర్చరీ, టెన్ని కాయిన్ తదితర క్రీడలలో విద్యార్థులు పాల్గొన నున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాల ఏర్పాట్లను గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, రమేశ్ పరిశీలించి క్రీడాకారులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇతర సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులను నిర్దిత గడువులోగా పరిష్కరించాలని, శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యల దరఖాస్తులను పరిష్కరించినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరుచాలని, పరిష్కారానికి సంబంధించిన వివరాలను సంబంధిత దరఖాస్తుదారుడికి అందజేయాలన్నారు. అలాగే జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా కొనసాగించాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, గన్ని బ్యాగ్స్, టార్పలీన్, వేయింగ్ మిషన్ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ హాస్టలను నిరంతరం పర్యవేక్షించి, విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈనెల 6న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేర్ల నమోదు ప్రక్రియ గడువు ముగుస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి

నవతెలంగాణ-జైనథ్



మండలంలోని కాప్రి నుంచి బేల వరకు రూ.25కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను సోమవారం ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తమ వంతు కృషి చేస్తున్నామని, ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీ నగేష్ సూచించారు. ఎన్నికల ముందు మాట్లాడిన మాటలకు అధికారం వచ్చిన తర్వాత చేసే వ్యవహారాలకు ఎలాంటి పొంతన లేదని, అందులో మార్పు రావాలని అన్నారు. కార్యక్రమంలో అధికారులు బీజేపీ నాయకులు రాందాస్, విజయ్, అంకత్ రమేష్, అశోక్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కరుణాకర్ రెడ్డి, రవీందర్, మహేందర్, సుభాష్, పొచ్చన్న, భూమన్న, రాకేష్ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతితో బాధ్యతలు మరింత అధికం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉద్యోగోన్నతితో బాధ్యతలు మరింత అధికమవుతాయని జిల్లా ఎస్పీ గౌస్ఆలం అన్నారు. తాంసి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్సైగా ఉద్యోగోన్నతి పొందిన మహమ్మద్ అబ్దుల్ రౌఫ్ సోమవారం ఎస్పీ గౌస్ ఆలంను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగోన్నతి పొందిన ఏఎస్సై ఉద్యోగోన్నతి చిహ్నం స్టార్‌ను ఎస్పీ భుజాలపై అలంకరించి అభినందనలు తెలియజేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగోన్నతితో బాధ్యతలు మరింత పెరుగుతాయని, విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ప్రజలకు న్యాయం చేసే విధంగా ఉండాలని సూచించారు. సమస్యలు తెలుసుకున్న వెంటనే సంఘటనా స్థలాలకు చేరుకుని బాధితుల సమస్యలను త్వరగా పరిష్కరిస్తూ, ఉండాలని సూచించారు. నీతి నిజాయితీగా విధులు నిర్వర్తించినప్పుడు పోలీసుల కీర్తి ప్రతిష్ఠలు సమాజంలో అధికమవుతాయని సూచించారు. ఉద్యోగోన్నతి పొందిన ఏఎస్సై బదిలీపై ఆదిలాబాద్ జిల్లా నుంచి నిర్మల్ జిల్లాకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

గౌడ సభను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

గౌడ కులస్తుల సమస్యలపై ఈనెల 6 నిర్మల్‌లో జరిగే మహా సభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ల రాజేందర్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లేష్ గౌడ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గౌడ సంఘంలో ఐక్యతలేని కారణంగా పోలీసులు, వీడీసీ, ఆబ్కారిశాఖ దాడులు పెరిగిపోయాయని పేర్కొన్నారు. టీఎఫ్టీ లైసెన్సుల కేసుల వేధింపులు ఎక్కువైనాయని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయి గౌడ కుల సంఘం నాయకులు పాల్గొనే ఈ సభకు కులసభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రైతు భరోసా వెంటనే విడుదల చేయాలి

- టీఏజీఎస్ నిర్మల్

నవతెలంగాణ-పెంబి

మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండలాధ్యక్షులు లక్ష్మణ్ అధ్యక్షతన ముఖ్య నాయకులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నిర్మల్ జిల్లా కార్యదర్శి తొడసం శంభు హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో పాటు అనేక హామీలు ఇచ్చిందన్నారు. మహిళలకు మాహా లక్ష్మి పథకం కింద బస్సు మాత్రమే ఉచిత ప్రయాణానికి అమలు చేసింది మిగతా హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. రైతులకు రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలు రెండు దఫాలుగా రూ.7వేల500 ఇస్తామని చెప్పి సర్వేల పేరుతో, కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందన్నారు. రైతులు రైతు భరోసా కింద వచ్చే డబ్బులు రాకపోవడంతో పంటకు పెట్టుబడి పెట్టకపోతే పంట అధికదిగుబడి రాదని, దళారుల నుంచి ఎక్కువ వడ్డీ అయినా సరే అప్పు తీసుకోవడంతప్పదని అన్నారు. అప్పులు తీసుకొని సరైన సమయంలో మందులు వాడకపోవడంతో పంటలు కూడా దెబ్బ తిన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే రైతు భరోసా కింద వచ్చే డబ్బులను వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి, పెద్ద పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మరప ఓనజీ, కొట్నాక్ బాదు, కాతలే లింబరావ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

కుమురంభీం ఆసిఫాబాద్

మంగళవారం | నవంబర్ 05, 2024 | www.navatelangana.com

ప్రజావాణి అర్జీలకు పరిష్కారాలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తుల స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కెరమెరి



మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఆదివారం మృతి చెందడంతో సోమవారం ఎమ్మెల్యే కోవలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెడ్ కానిస్టేబుల్ మృతి తీరని లోటన్నారు. వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. ఆమె వెంట మాజీ ఎంపీపీ పెందూర్ మోతీరాం, మాజీ వైస్ ఎంపీపీ అబుల్ కలాం, నాయకులు ధర్మ అంబాజీ, మణిరాం, భరత్ భూషణ్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూపులాల్ నాయక్ పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని కార్పొరేట్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జీఎం ఎ.మనోహర్ అన్నారు. సోమవారం బెల్లంపల్లి ఏరియాలో జీఎం ఎం.శ్రీనివాస్‌తో కలిసి ఖైర్‌గూడ ఓసీకి చేరుకున్నారు. ఇక్కడ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో ఉత్పత్తి వివరాలను తెలుసుకున్నారు. ఉల్లిపిట్ట, డోర్లి గ్రామాలకు వెళ్ళే మార్గంలో వాగుపై నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలించారు. వట్టివాగు రిజర్వాయర్ రక్షణ కట్టను చూసి పలు సూచనలు చేశారు. వెస్ట్ వ్యూ పాయింట్ నుండి ఖైర్‌గూడ ఓసీ పని స్థలాలు వీక్షించారు. పంపుల పనితీరు, నీటి పంపింగ్‌పై అధికారులకు సూచనలు చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలపై అధికారులు సిబ్బందికి మార్గ నిర్దేశం చేశారు. అంతకు ముందు జీఎం కార్యాలయంలో అధికారులు ఆయనను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో పీఓ ఎం.నరేందర్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, మేనేజర్ జె.శంకర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ అభయహస్తం అమలు చేయాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు దళితుల సంక్షేమం కోసం అంబేద్కర్ అభయహస్తం పేరుతో రూ.12 లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీనీ చిత్తశుద్ధితో అమలు చేయాలని కేవీపీఎస్ కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సంఘాల కార్యాలయంలో కేవీపీఎస్ జిల్లా స్థాయి సమావేశం సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాజ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికీ ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేవీపీఎస్ విద్యార్థి సంఘాలు దశల వారీగా సాగించిన పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచుతూ జీఓ నెంబర్ 9 విడుదల చేసిందన్నారు. వాంకిడి ఆశ్రమ బాలికల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థులను నేటి వరకు అధికారులు పరామర్శించక పోవడం బాధాకరమన్నారు. వెంటనే విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం రాజ్ కుమార్, నాయకులు ప్రసాద్, పవన్, వినోద్, రామచందర్ పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీల్లో ఆదిలాబాద్ విజేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మూడు రోజుల పాటు జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో పీడీ గడిగొప్పుల సదానందం జ్ఞాపకార్థం జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఇందులో ఆదిలాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ముగింపు పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ రవీందర్, మాజీ ఎంపీపీ మల్లికార్జున్ విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ద్వితీయ బహుమతి మహబూబ్ నగర్ జట్టు సొంతం చేసుకోగా, మూడో స్థానంలో కరీంనగర్ నాలుగో స్థానంలో రంగారెడ్డి జట్లు నిలిచాయి. కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్యామల పవన్ కుమార్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్, గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సునార్కర్ అరవింద్, ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్ కడతల రాకేష్, ఏసీఎంఓ ఉద్ధవ్, పాఠశాల హెచ్ఎం జంగు, కోచ్‌లు విద్యాసాగర్, రవి తిరుమల్, పీడీ విశాల, పీఈటీ రాజలింగు, కళ్యాణ్, సాయి, రమేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ శ్యామ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముసడే చరణ్, యాదగిరి, గోకుల్, రవి, లక్మన్, మంగ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు నాస్‌పై అవగాహన

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు యాదగిరి నాస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 4న జరిగే నాస్ పరీక్ష కోసం విద్యార్థులకు మెలకువలు తెలియజేయాలని సూచించారు. అలాగే ఉపాధ్యాయులు పాఠశాలలో సమయపాలన పాటించాలని, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయాలని డీఐఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరు సతీష్ అన్నారు. సోమవారం మండలం వంకులం గ్రామ పంచాయతీలోని రాళ్లపేట గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే ఉందన్నారు. చెత్తకుండీలు లేకపోవడంతో రోడ్డుపై చెత్త చెదారం పేరుకు పోయిందన్నారు. అంగన్‌వాడీసెంటర్ ముందు చెత్త ఉన్న పట్టించుకోవడం లేదన్నారు. సెంటర్‌లో బాలింతలు, గర్భిణులు వస్తుంటారని దీని వల్ల అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. సంబంధిత అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు చాపిడి శ్రావణి పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా

నవతెలంగాణ-వాంకిడి



ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం మండలంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను పీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల పచ్చి ఆకు కూరగాయల ఆహారాన్ని, గుడ్లు, పాలు, రాగి, మాల్టా అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు భోదించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఔషధాల రిజిస్టార్ పరిశీలించి ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అనంతరం మంచిర్యాల జిల్లాలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆస్పత్రిని సందర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులపై థర్డ్ డిగ్రీయా ఇదెక్కడి రాజ్యం..?

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు
- అటవీ ఆఫీసర్లను సస్పెండ్ చేయాలని నిరవధిక దీక్ష



నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ నియోజకవర్గంలో అటవీ శాఖ అధికారుల దౌర్జన్యాల వలన పేద ప్రజలు, రైతులు మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. వారం రోజుల క్రితం మండలంలోని లక్ష్మీపూర్ బెంగాల్ క్యాంప్ రైతులు అడవిపందిని చంపరానే అనుమానంతో ఏడుగురు వ్యక్తులకు కండ్లకు గంతులు కట్టి చితకబాది రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసేందే. రైతులు చేయని నేరానికి వారిని ఇబ్బంది పెట్టి అక్రమంగా కేసులు బనయించి దౌర్జన్యం చేశారని, దాడి చేసిన అటవీ అధికారులను సస్పెండ్ చేయాలనే డిమాండ్‌తో సోమవారం మండల కేంద్రంలోని అటవీ క్షేత్రాధికారి కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహార దీక్షను చేపట్టారు. సిర్పూర్ రేంజర్, సెక్షన్ ఆఫీసర్లను వెంటనే సస్పెండ్ చేయాలని, వారికి వత్తాసు పలుకుతూ వారికి అండగా ఉంటున్న డీఎఫ్ఓను వెంటనే బదిలీ చేయాలన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకునే వరకు ఆమరణ నిరాహార దీక్ష ఆపేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పేద రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, రాష్ట్ర ఓబీసీ మోర్చా కమిటీ కన్వీనర్ గోలెం వెంకటేష్, మండల అధ్యక్షులు ఎల్ములే శంకర్, నరులెవాను పటేల్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఒడ్డేటి నాని, కౌటాల బీసీ సెల్ మండల అధ్యక్షుడు పెద్దపెల్లి భీమయ్య, సీనియర్ నాయకులు నీరటి సత్యనారాయణ, నేరెళ్ల అశోక్, పైడి విలాస్, బజరంగ్‌దళ్ మండల అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, బీజేవైఎం మండల అధ్యక్షుడు బనర్కర్ సాయి పాల్గొన్నారు.



సమగ్ర సర్వేను సమన్వయంతో పూర్తి చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి ఈ నెల 6 నుండి ప్రారంభమయ్యే సర్వే కార్యక్రమంపై మండల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, పంచాయితీ, మండల ప్రత్యేక అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు సర్వే నిర్వహణపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా సర్వే ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే సామాజిక, ఆర్థిక విద్య, రాజకీయ కుల అంశాలపై సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ అల్బర్ట్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల వివరాలు, విద్యార్హతను, ఆర్థిక తదితర సంబంధించిన వివరాలు, వర్త కార్మికులు, చిరు వ్యాపారులు, కుల, మత, మిత అన్ని విషయాల వాటిపై సర్వే ఏ విధంగా చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ నజ్రుల్లాఖాన్, ఏఎస్ఓ దామోదర్, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

కౌటాల : కుల సర్వే ను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ కోట ప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సమగ్ర కుటుంబ సర్వే ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. సర్వే నిర్వహించాల్సిన తీరు, ప్రొఫార్మ నింపే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం సర్వే స్టేషనరీని అందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి గావుడె హనుమంతు, డిప్యుటి తహసీల్దార్ మస్కూర్ అలీ, ఎంపీఓ మహేందర్ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వేను సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను వాస్తవ సమాచారం మేరకు వివరాలు సేకరించాలని తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఈనెల 6 నుంచి 8 వరకు గ్రామాలలో ప్రతి ఇంటి సంబంచిన జాబితాను గుర్తించిన తర్వాత 18 వరకు కుటుంబ సర్వేను నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, మండల విద్యాధికారి వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ బక్కయ్య, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : సమగ్ర కుటుంబ సర్వే శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

వాంకిడి : మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద సామాజిక ఆర్థిక విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నిర్వహణ విధానంపై ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్వే విధానం పై మాస్టర్ ట్రైనీలు రాజలింగు, సుశీల్ కుమార్, హరీష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంఈఓ శివచరణ్ కుమార్, పీజీ హెచ్ ఎంలు ప్రబాత్ కుమార్, నటరాజ్, ఎంపీఓ అజీజొద్దీన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన అంశాలపై శిక్షణ అందించారు. తహసీల్దార్ మునవర్ షరీఫ్, ఎంపీఓ సుధాకర్ రెడ్డి, ఎంఈఓ జయరాజ్ మాట్లాడుతూ మండలంలో 21 ఎన్యూమరేషన్ బ్లాక్‌ను గుర్తించినట్లు తెలిపారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీలో 55 ఎన్టీటీ, 8 మంది సూపర్‌వైజర్లు సిబ్బందిని నియమించినట్లు వివరించారు.



పెంచికల్‌పేట్ : శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్



కౌటాల : ఎన్యూమరేటర్లకు స్టేషనరీని అందిస్తున్న అధికారులు

ప్రారంభమైన పండరిపూర్ పాదయాత్ర

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రతి కార్తీక మాసంలో నిర్వహించే పండరీపూర్ పాదయాత్ర జిల్లా కేంద్రంలో మంగళవారం ప్రారంభమైంది. చైతన్య సాంప్రదాయ సమితి ఆధ్వర్యంలో పండర్ పూర్ పాదయాత్ర వ్యవస్థపాకులు ఆడే తుకారం మహారాజ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్ర 23 సంవత్సరాల నుండి ఆనవాయితీగా కొనసాగుతుందన్నారు. భక్తి శ్రద్ధలతో భక్తులు, కీర్తనలు, భక్తి నృత్యాలతో పాదయాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో యాత్ర ప్రముఖులు కొమ్ము రాంచందర్, దావలే బాలాజీ, ఉట్నూర్ వైస్ మాజీ ఎంపీపీ సామాజిక కార్యకర్తల జాదవ్ రవీందర్, యాత్ర కో ఆర్డినేటర్ దావుల రమేష్, యాత్ర అధ్యక్షులు తులసి రామ్, వెంకట్రావు పటేల్, కేర్బా మహారాజ్, టాబ్లీస్ట్ సుదర్శన్ మహారాజ్ భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

నవతెలంగాణ-కెరమెరి



మండలంలోని చిన్న సాకడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థులకు సోమవారం పెందూర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి ఆధ్వర్యంలో నోట్ బుక్స్, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందూరర్ మోతిరాం, ఎస్ఈఆర్పీ చాహకటి శ్యాంరావు, సేవ సమితి సభ్యులు పెందూర్ శ్రీనివాస్, పెందూర్ వినేష్, దుర్వ శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు సుజాత ఉన్నారు.

గురుకుల సీటు ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

గురుకుల, మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే పాఠశాలలో సీటు ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకొని మోసం చేసిన చెడువాయి గ్రామానికి చెందిన బుజాడి వెంకటేష్‌పై ఫిర్యాదు చేశారు. బాధితులు ఒడ్డుగూడ గ్రామానికి చెందిన జావారి సంతోష్, రౌతు శంకర్ గురుకుల పాఠశాలలో సీటు ఇప్పిస్తానని చెప్పి రూ.15000 వెంకటేష్‌కు ఇచ్చాడు. సీటు ఇప్పించకపోవడంతో తిరిగి డబ్బులు అడగగా దాటవేస్తున్నాడు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని పెంచికల్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్సై కొమురయ్యను సంప్రదించగా బాధితులు ఫిర్యాదు చేశారని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

సెమీస్కిల్డ్ వేతనాలు అమలు చేయాలి



నవతెలంగాణ-రెబ్బెన

కాంట్రాక్ట్ కార్మికులకు ఒప్పందం ప్రకారం సెమీ స్కిల్డ్ వేతనాలు వెంటనే అమలు చేయాలని, ఖైరీగూడ ఓసీపీ క్యాంటీన్ కాంట్రాక్ట్ రమేష్‌పై చర్యలు తీసుకోవాలని టీబీజీకేస్ అనుబంధ తెలంగాణ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం బెల్లంపల్లి ఏరియా అధ్యక్షులు ఏ ఓదేలు అన్నారు. సోమవారం ఖైరిగూడ ఓసీపీలో బెల్ట్ క్లీనింగ్, క్యాంటీన్, బ్లాస్టింగ్, ఓసీ టు ఏరియా స్టోర్ కార్మికులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు కాంటాక్ట్ కార్మికుల సంఘం నాయకులు ప్రవీణ్, టీబీజీకేఎస్ నాయకులు మారిన వెంకటేశ్వర్లు, బొంగు వెంకటేశ్వర్లు, గణపతి ఉన్నారు. ఈ సందర్భంగా ఓదెలు మాట్లాడుతూ బెల్టు క్లీనింగ్ కార్మికులకూ సేమిస్కిల్డ్ కేటగిరి వేతనాలు చెల్లించాలని, 2022 సెప్టెంబర్ 26న కాంటాక్ట్ కార్మికుల జేఏసీతో ఒప్పందం చేసుకున్న సింగరేణి యాజమాన్యం ఇప్పటివరకు అమలు చేయడం లేదన్నారు. ఓసి క్యాంటీన్లో పనిచేస్తున్న ఆరుగురుకి, రోడ్డు క్లీనింగ్ మహిళా కార్మికులు 8 మందికి చెల్లించలేదని కన్వినెన్స్ డ్రైవర్ ఎస్కే హర్షత్‌కు కూడా రూ.5000 చెల్లించలేదని వెంటనే వారికి రూ.5000 డిమాండ్ చేశారు. అంతకు ముందు జీఎంకు సమస్యలపై వినతిపత్రం అందించారు.

జ్వరంతో దివ్యాంగ బాలిక మృతి

నవతెలంగాణ-చింతలమానేపల్లి

జ్వరంతో దివ్యాంగ బాలిక మృతి చెందిన ఘటన మండలంలోని బాబాసాగర్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. దివ్యాంగురాలు శివాని (17) జ్వరంతో వారం రోజుల నుండి బాదపడుతుంది. కుటుంబీకులు ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లిన ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. సోమవారం ఇంట్లోనే మృతి చెందినట్టు తెలిపారు.

పంట నష్టంపై రీసర్వే చేయించాలి



నవతెలంగాణ-చింతలమానేపల్లి

ప్రాణహిత ఉప్పొంగి పంటలు నష్టపోయిన వారి వివరాలు కాకుండా ఇతరుల పేర్లు నమోదయ్యాయని దీనిపై రీ సర్వే చేయాలని గ్రామస్తులు కోరారు. మండలంలోని ప్రాణహిత నది పరివాహక ప్రాంతాలు దింద, కేతిని, చిత్తం గ్రామ రైతులు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్ఐ జాఫర్‌కు వినతిపత్రం అందించారు. అంతకుముందు ఆయా గ్రామాల రైతులు మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో జులై, ఆగస్టు కురిసిన భారీ వర్షాలకు ప్రాణహిత నది ఉప్పొంగి, పంటలు నీట మునగడంతో రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టంపై వ్యవసాయ అధికారులు సర్వే నిర్వహించారన్నారు. సర్వేలో పంటలు నీటి మునిగిన రైతుల పేర్లు నమోదు లేక, ఇతర వారి పేర్లు నమోదు అయినట్లు లిస్టు వచ్చిందని తెలిపారు. అందుకు సంబంధిత అధికారులు రీ సర్వే నిర్వహించి నిజమైన లబ్ధిదారులను గుర్తించి నష్టపరిహారం అందించాలని కోరారు.

పశువైద్యాధికారికి సన్మానం

నవతెలంగాణ-కెరమెరి



మండల పశు వైద్యాధికారిగా సురేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సోమవారం విధి నిర్వహణలో భాగంగా చౌపన్‌గూడ గ్రామాన్ని సందర్శించారు. ఈ నేపథ్యంలో తొలిసారి గ్రామానికి వచ్చిన అధికారికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం శాలువతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆత్రం బొజ్జిరావు, దందు, రాము పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కౌటాల



భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలో మండల కమిటీని ఎన్నికల నిర్వహించారు. సిర్పూర్ నియోజకవర్గం యూత్ కన్వీనర్ కాశి పాక రాజు ఆధ్వర్యంలో కౌటాల మండల కమిటీని ఎన్నుకోని ప్రకటించారు. ఓటింగ్ విధానం ద్వారా జరిగిన ఈ ప్రక్రియలో కౌటాల మండల యూత్ అధ్యక్షులుగా తాళ్లపల్లి కార్తీక్, ఉపాధ్యక్షుడిగా జాడే బాజీరావు, సెక్రటరీగా కామ్రే గణేష్, ట్రెజరరీగా చునర్కార్ దిలీప్, దడ్డి గోపాల్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | నవంబర్ 05, 2024 | www.navatelangana.com

జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక



నవతెలంగాణ-నస్పూర్

డిసెంబర్ 11,17 తేదీలలో పంజాబ్ లూథియానాలో నిర్వహించే జాతీయ స్థాయి కరాటే (ఎస్‌జీఎఫ్) టోర్నమెంట్లో మంచిర్యాల జిల్లాకు చెందిన బోయిని చైత్ర అండర్-14 కరాటే టోర్నమెంట్‌కు ఎంపికైందని మాస్టర్ పోషంపల్లి వెంకటేష్ తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో నవంబర్ 2 నుండి 4 వరకు నిర్వహించిన 68వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-14 బాల బాలికల స్టేట్ లెవెల్ కరాటే పోటీల్లో ఎంపికైన చైత్ర 35 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి జాతీయస్థాయి కరాటే టోర్నమెంట్‌కు ఎంపికైందన్నారు.

సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు

నవతెలంగాణ-కాసిపేట



కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మతులు చేయించారు. కాసిపేట, సోమగుడెం రహదారి మధ్య గల బ్రిడ్జ్ మూల మలుపు వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ప్రమాదాలు ఎక్కువ జరుగుతూ రోడ్డుపై సింగరేణి కార్మికులకు, ఓరియంట్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే స్పందించి తన సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మత్తులు చేయించారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు

నవతెలంగాణమంచిర్యాల



ప్రభుత్వ వసతి గృహల్లో చదువుకునే విద్యార్థులకు డైట్ కాస్మోటిక్ ఛార్జిలను పెంచిన నేపథ్యంలో మంచిర్యాల జిల్లా కు చెందిన సంక్షేమ హాస్టల్‌లో చదువుకునే విద్యార్థులు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ని జూబ్లీ హిల్స్‌లోని తన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులతో ముఖ ముఖిగా మాట్లాడిన సీఎం విద్యార్థులు సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనలు నిర్మించాలని కోరారు. సీఎం మాట్లాడుతూ సొంత భవనాలకు స్థల సేకరణ చేపడుతామని ప్రజా ప్రభుత్వంలో విద్య వ్యవస్థలో సముల మార్పులు తీసుకొస్తామని, స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి, త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఉన్నత చదువులు చదువుకొని తెలంగాణ పునర్నిర్మాణంలో మీరంతా బాగ స్వాములు కావాలని సూచించారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మంచిర్యాలా సంక్షేమ హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

జపాన్ సకురా సైన్స్ ఎక్స్ఛేంజ్‌కు విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-నస్పూర్



భారత ప్రభుత్వం, సెక్రటరీ ఆఫ్ ఎడ్యుకేషన్-న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో జపాన్‌లో నిర్వహించే సకురా సైన్స్ ఎక్స్చేంజ్ కార్యక్రమానికి మంచిర్యాల కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంలో 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విద్యాసింగ్ ఎంపిక కావడం అభినందనీయమని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్యతో కలిసి విద్యార్థినికి నగదు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జపాన్ నిర్వహిచే సకురా సైన్స్ ఎక్స్చేంజ్ కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థిని ప్రయాణ ఖర్చులు, వసతి అన్ని సౌకర్యాలు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని, విద్యార్థిని సొంత ఖర్చులకు దాతలు అందజేసిన రూ.9 వేల నగదును విద్యార్థినికి అందజేశారు. విద్యాసింగ్ చిన్న వయసులో అద్భుత అవకాశాన్ని చేజిక్కించుకుందని, అంతర్జాతీయ సైన్స్ ఎక్స్చేంజ్ కార్యక్రమంలో పాల్గొననుందని, అక్కడ విశిష్టతలు, నూతన ఆవిష్కరణలను పరిశీలించి తన తోటి విద్యార్థులందరికీ తాను నేర్చుకున్న అంశాలను వివరించాలని తెలిపారు. ఈ పర్యటనలో శాస్త్రవేత్తలతో ముఖాముఖి, చర్చలలో పాల్గొనడం, స్పేస్ స్టేషన్, సైన్స్ కేంద్రాలను వీక్షించి, వారు కనుగొన్న సైన్స్ విషయాలను నేర్చుకోనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, కస్తూరిబా బాలికల పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న పాల్గొన్నారు.

దుగ్నపల్లిలో కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం

నవతెలంగాణ-తాండూర్

తాళ్ల గురిజాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుగునపల్లిలో సోమవారం ఉదయం పోలీసులు కమ్యూనిటీ కాంట్రాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. 25 టూ వీలర్స్, ఆటో ను, రెండు లీటర్ల గుడుంబాను సీజ్ చేశారు. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలూద్దీన్ మాట్లాడుతూ గంజాయి సేవించడం, రవాణా చేయడం, అమ్మడం నేరమని తెలిపారు. మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాళ్ల గురిజాల ఎస్ఐ రమేష్, బెల్లంపల్లి 2 టౌన్ ఎస్ఐ మహేందర్ పాల్గొన్నారు.

కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిలో ప్రమోషన్ పత్రాలు అందజేత

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిలో 92 మంది బదిలీ వర్కర్లకు జనరల్ మజ్దూర్ ఉద్యోగోన్నతి పొందడంతో సంబంధిత పత్రాలను కార్మికులకు అందించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బదిలీ వర్కర్ నుంచి జనరల్ మజ్దూర్‌గా పదోన్నతి పొందిన కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. గనిలో పని ప్రదేశంలో సేఫ్టీ పద్ధతిలో ఉత్పత్తి సాధించడంలో కార్మికులు అవగాహన కలిగి ఉండాలని, డ్యూటీకి వచ్చే సమయంలో హెల్మెట్ ధరించాలని, కార్మికులు గైర్హాజరు శాతం తగ్గించి, సంస్థ ఉత్పత్తికి పాటు పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, గని సేఫ్టీ ఆఫీసర్ రవిశంకర్ పాల్గొన్నారు.

మండలంలో ప్రారంభమైన ఇంటింటి సర్వే

నవతెలంగాణ-హాజీపూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి, సమగ్ర కుల గణన సర్వేలో భాగంగా సోమవారం హాజీపూర్ మండలంలోని గ్రామాల్లో వేగవంతంగా కొనసాగుతోంది. సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్తున్న ఎన్యుమరేటర్లు స్టిక్కర్లు అంటించారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 75 ఎన్యుమరేటర్ బ్లాక్ లు ఉండగా 65 మంది సర్వే చేపడుతున్నారు. ఈ సర్వేకు సంబంధించి 6 గురు సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తున్నారు. గుడిపేటలో నిర్వహించిన సర్వేను ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్పాండే పర్యవేక్షించారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని ముదిగుంట గ్రామానికి చెందిన విద్యార్థి పత్తి సాయి రాహుల్ విద్యార్థికి ఆత్మీయ చారిట్రబుల్ ట్రస్ట్ సభ్యులు రూ. 15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన పత్తి రజినీకాంత్ కుమారుడైన సాయి రాహూల్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిన ట్రస్టు సభ్యులు సోమవారం రాహూల్ కుటుంబ సభ్యులను కలిసి ఆర్థిక సాయం అందజేశారు. ఇంతటితో కాకుండా భవిష్యత్‌లో కూడా సహకారం అందిస్తామని సట్ల మహేందర్ భరోసా ఇంచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిగుంట మాజీ సర్పంచ్ అంజన్ గౌడ్, నాయకులు లక్ష్మన్ ట్రస్టు సభ్యులు కాయం తిరుపతి, బొద్దుల సతీష్, బీ సతీష్, సీహెచ్ అశోక్, సంపత్, సుభాష్, అశోక్ పాల్గొన్నారు.

గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఆర్పీ-3, 3ఏ గనిలో పని చేస్తూ జనవరి నుంచి అక్టోబర్ వరకు 75 మాస్టర్ల కంటే తక్కువ హాజరు నమోదు చేసిన ఉద్యోగులకు గని మేనేజర్ వెంకట్ రావు సోమవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించి విధులకు హాజరు కాకపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గని మేనేజర్ మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి నిర్ణీత మస్టర్లు తప్పని సరిగా పూర్తిచేయాలన్నారు. ఈ సంవత్సరంలో మిగిలిన రెండు నెలలో చేసే మస్టర్లను గమనించడం జరుగుతుందన్నారు. అనంతరం డ్యూటీ చేయటం వల్ల కలిగే ప్రయోజనాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గని రక్షణాధికారి మహేందర్, సంక్షేమ అధికారి గౌస్ పాషా, పిట్ కార్యదర్శి మురళీ చౌదరి, ఉత్తమ ఉద్యోగి రోమోజీ పాల్గొన్నారు.

విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్

నవతెలంగాణ-మంచిర్యాల



గత వారం రోజుల క్రితం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయి మంచిర్యాల ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను సోమవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ పరామర్శించారు. చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. 6 గురు విద్యార్థినిలు మంచిర్యాలలో చికిత్స పొందుతుండగా రెండు రోజుల క్రితం మెరుగైన చికిత్స మేరకు ఇద్దరు విద్యార్థులను హైదరాబాద్‌కు తరలించారని, మరొక విద్యార్థి వెంటిలేటర్‌పై చికిత్స పొందుతుండగా మరో ముగ్గురు విద్యార్థినులకు ట్రీట్మెంట్ జరుగుతున్నట్లు తెలిపారు. ఫుడ్ పాయిజన్‌కు గల కారణాలు తెలుసుకొని విద్యార్థులు తిన్న ఆహారంలో ఏమైనా కలిపి ఉంటారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయని, దీని పై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

సమాజ సేవలో ఆర్యవైశ్యులు ముందుండాలి

- రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

సమాజ సేవలో ఆర్యవైశ్యులు ముందు ఉండాలని ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలో గుండపెద్ద కాశయ్య ఆర్యవైశ్య భవనంలో ఏర్పాటుచేసిన మంచిర్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సభ్యత్వ నమోదు కోసం నూతన కార్యవర్గం కృషి చేయాలని కోరారు. మంచిర్యాల ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం జిల్లాలో నిరుపేద ఆర్యవైశ్యుల విద్య, వైద్య ఖర్చులకు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన మంచిర్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు కొత్త వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చిలువేరు వైకుంఠం, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాల సంతోష్, ప్రధాన కార్యదర్శి బొద్దుకూరి రాజ్ కుమార్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు నాగిశెట్టిజ్యోతి, ప్రధాన కార్యదర్శిగా నరేందుల సాహితి, కేశెట్టి వంశీ, లీగల్ అడ్వైజర్ నళినీకాంత్, పలువురు ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శి కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు ఇరుకుల్ల రామకృష్ణ, రాష్ట్ర మహాసభ ఉపాధ్యక్షుడు నలమాస్ కాంతయ్య, గుండ పెద్ద కాశయ్య భవన స్థలదాత గుండ వీరేంద్ర దాస్, రాష్ట్ర నాయకులు ముక్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏడు ఉద్యోగాలు సాధించిన వ్యక్తికి గ్రామస్తుల సన్మానం

నవతెలంగాణ-జన్నారం



కష్టపడి చదివితే ఉద్యోగాల సాధన కష్టమేమీ కాదని నిరూపిస్తున్నారు నస్పూరి సంతోష్. ఆయన ఒకటీ రెండు కాదు.. ఏకంగా ఏడు ఉద్యోగాలు సాధించారు. మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన రైతు నస్పూరి లచ్చన్న, రాజవ్వ దంప తుల కుమారుడు సంతోష్ పదో తరగతి వరకు తపాలపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదివారు. ఇంటర్, డిగ్రీ, పీజీ హైదరాబాద్‌లో పూర్తి చేశారు. బీఈడీ రాయలసీమ యూనివర్సిటీలో పూర్తి చేసి ఉద్యోగాల వేటలో పడ్డాడు. 2023లో రైల్వేలో ఉద్యోగాల ప్రకటన రావడంతో పరీక్షలు రాసి పాయింట్మెన్ ఉద్యోగం సాధించారు. అదే సంవత్సరం సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు పరీక్ష రాసి ఉద్యోగం సాధించారు. సింగరేణిలో ఉద్యోగం చేస్తూనే ఈ ఏడాది గురుకుల ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుని ఏకంగా టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్, సంతోష్ డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాలు సాధించారు. వాటిలో చేరకుండా టీజీపీఎస్సీ వేసిన నోటిఫికేషన్‌లో జూనియర్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకుని చదివారు. అక్టోబర్ 27న వెలువడిన ఫలితాలో జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సాధించారు. తనను కష్టపడి చదివించిన అమ్మానాన్నల ఆశీర్వాదంతోనే ఇన్ని ఉద్యోగాలు సాధించానని సంతోష్ తెలిపారు. ప్రస్తుతం సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం చేస్తున్న సంతోష్ జూనియర్ లెక్చరర్ ఉద్యోగంలో చేరుతానని వెల్లడించారు. ఈ సందర్భంగా సోమవారం రోటి గుడా గ్రామస్తులు గ్రామపంచాయతీలో సంతోష్‌ను శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మల్క విజయ లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ కొంతం శంకరయ్య, భారత సత్యనారాయణ, ఉప్పు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రవాణా శాఖ తనిఖీలు



నవతెలంగాణ-హాజీపూర్

జిల్లా రవాణా శాఖా ఆధ్వర్యంలో చేడుతున్న వాహన తనిఖీలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. సోమవారం జిల్లా కేంద్రంతో పాటు సీసీసీ, శ్రీరాంపూర్, ఇందారం, ఓపెన్కాస్ట్ గనుల పరిసర ప్రాంతాల్లో భారీ, మధ్య తరహా వాహనాలను తనిఖీ చేశారు. ఇన్‌చార్జి డీటీఓ రంజీత్‌రెడ్డి, ఎంవీఐ కిషోర్ చంద్రారెడ్డి, అసిస్టెంట్ ఎంవీఐ ఖాసిం ఆధ్వర్యంలో వాహన తనిఖీ చేశారు. అందులో భాగంగా పన్నుల చెల్లింపులు జరపకుండా, ఫిట్నెస్ లేకుండా తిరగడంతో పాటు ఓవర్లోడ్ ఉన్న వాహనాలను గుర్తించి రూ.2 లక్షల వరకు జరిమానా విధించారు. జిల్లాలో వాహన తనిఖీలు నిరంతరం సాగుతాయని పేర్కొంటూ పన్ను చెల్లించకుండా, ఫిట్నెస్ లేకుండా రహదారులపైకి వస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానాలు తప్పవని స్పష్టంగా చేశారు. తనిఖీల్లో రవాణా శాఖా హెడ్ కానిస్టేబుల్ చంద్రయ్య, హోంగార్డులు వేణు, రమేశ్ పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

నవతెలంగాణ-జైపూర్



పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం సీఐటీయూ నాయకులతో కలిసి ఏపీఎం రాజ్‌కుమార్‌కు వినతీ పత్రం అందజేశారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ప్రకారం గ్రామ సంఘాల నుంచి అందవల్సిన రూ.3 వేలు అమలు చేయకపోవడం బాధాకరమని అన్నారు. అదేవిదంగా గ్రామ సమైక్యల నుండి రావల్సిన రూ.3 వేల వేతనాన్ని వీఓఏలకు వెంటనే ఇవ్వాలని అన్నారు. గ్రామ సంఘాలకు రావాల్సిన స్త్రీనిధి ఇన్‌సెంటీవ్ గత 2 సంవతసరాల నుండి రావడం లేదని, పెండింగ్‌లో ఉన్న స్త్రీనిధి ఇన్సెంటీవ్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ సంఘాలలో ల్యాప్‌ట్యాప్‌లు లేకపోవడంతో ఫోన్లు సపోర్టు చేయక ఆన్‌లైన్ పనులు చేయలేకపోతున్నామని ఆవేధన వ్యక్తం చశారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి ల్యాప్‌ట్యాప్‌లు, ట్యాబ్‌లు పంపిణీ చేయాలని కోరారు. గ్రేడింగ్ పద్ధతిని రద్దు చేసి వీఓఏలకు ప్రతి నెల 1న వేతనాలు చెల్లించాలని ప్రతి 3 నెలలకు ఒకసారి అనగ్రేడ్-5 రెన్యూవల్ పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గల్ఫ్ బాధిత కుటుంబాలు ఎక్స్‌గ్రేషియాకు దరఖాస్తు చేసుకోవాలి



నవతెలంగాణ-జన్నారం

గల్ఫ్ కార్మికుల బాదిత కుటుంబాలు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా కోసం కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకోవాలని గల్ఫ్ సంక్షేమ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అమరగొండ తిరుపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సంవత్సరం డిసెంబర్ 7 తర్వాత మృతి చెందిన గల్ఫ్ కార్మికుల కుటుంబాల వారు మాత్రమే కలెక్టరేట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వారికి ప్రభుత్వం రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తుందన్నారు. ముఖ్యమంత్రి గల్ఫ్ కార్మికుల కోసం 216 జీఓ తీసుకొచ్చి గల్ఫ్ కార్మికులకు న్యాయం చేశారన్నారు. ఈ అవకాశాన్ని గల్ఫ్ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు దూమల్ల ఎల్లయ్య పాల్గొన్నారు.

రానున్న భవిష్యత్ ఎలక్ట్రిక్ వాహనాలదే

నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని కళాంజలి ఫంక్షన్ హాల్‌లో సోమవారం కార్తికేయ ఈ-బైక్స్ ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ వాహనాల గురించి అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంపాక్ట్ ట్రైనర్స్ కొంగల నరసింహులు, జెట్టి కృష్ణ, సూరారం ప్రశాంత్ మాట్లాడుతూ రానున్న భవిష్యత్తు ఎలక్ట్రిక్ వాహనాలదేనని అన్నారు. రాబోవు కాలంలో ఈ-బైక్స్ వేగంగా అభివృద్ధి చెందుతుందని, దేశ జనాభాలోమూడు వంతుల జనాభా అనారోగ్యాలకు కారణం గాలి, శబ్ద కాలుష్యమేనని అన్నారు. దీని నివారించేందుకు ప్రభుత్వాలు ఎంత ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ కాలుష్యాన్ని నివారించలేక పోతున్నాయన్నారు. దీనికి ఎలక్ట్రిక్ బైకులు అనుకూలమైన పరిష్కారాన్ని చూపుతున్నాయని తెలిపారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలను దృష్టిలో ఉంచుకుని ఈ-బైక్‌లు సామాన్యులకు కుడా అందుబాటు ధరలో ఉండే విధంగా కంపెనీ తయారు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడిమ్యాల శ్రీశైలం, కూకట్ల రాజ్ కుమార్ యాదవ్, పెంచాల జమున పాల్గొన్నారు.



అభయపై లైంగిక దాడి చేసి చంపిన నిందితులను శిక్షించాలి

నవతెలంగాణ-తాండూర్

కలకత్తాలో జూనియర్ డాక్టర్ అభయపై లైంగికదాడి చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు ముస్కె జ్యోతి డిమాండ్ చేశారు. సోమవారం బెల్లంపల్లి కాంటా చౌరస్తా నర్సింగ్ విద్యార్థినీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. అత్యాచారానికి గురైన అభయ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్వతంత్ర భారతదేశంలో మహిళలు ఉన్నత విద్యల కోసం నగరాలకు వెళ్లి చదివే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యాచార ఘటనలపై ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు అనిత, జిల్లా నాయకురాలు రాజక్క, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ అందజేత

నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు రూ.50 వేల విలువగల కంప్యూటర్‌ను విశ్రాంత ఉపాధ్యాయుడు ఆర్ఎల్ నరసింహారావు కుమారుడు రాచకొండ విజయ రంగారావు పాఠశాలకు కంప్యూటర్‌ను అందజేసి ఉదారతను చాటుకున్నారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజకు కంప్యూటర్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ పాఠశాలకు కంప్యూటర్‌ను అందించినందుకు పాఠశాల సిబ్బంది, విద్యార్థుల, తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి తమలాంటి వారి సహకారం ఉండాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయులు వారిని శాలువాతో సత్కరించారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ

నవతెలంగాణ-తాండూర్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, జాతీయ ప్రత్తి పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో తేనెటీగల పెంపకంపై శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. జాతీయ ఆహార భద్రత మిషన్ ఉత్తమ పద్ధతుల ద్వారా రైతుల సాగు ఉత్పాదకతను పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 425 ఎకరాలలో రైతు క్షేత్రాలలో ప్రదర్శనలను నిర్వహిస్తున్నామన్నారు. హామీల యువకులకు తేనెటీగల పెంపకంలో పాటించాల్సిన మెళకువలపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి శాస్త్రవేత్తలు డా తిరుపతి, నాగరాజు, యంగ్ ప్రొఫెషనల్స్ డా. ప్రియాంక, శైలజ, అనిల్ పాల్గొన్నారు.

యూఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా మహాసభల కరపత్రాలు విడుదల

నవతెలంగాణ-జన్నారం

యూఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా మహాసభల కరపత్రాలను సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆ విద్యార్థి సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మిట్టపల్లి తిరుపతి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ యుఎస్ఎఫ్ఐ మొట్టమొదటి అఖిల భారత మహాసభలు డిసెంబర్ 14, 15 తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయవాడ కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం 1984 సంవత్సరంలో ఉస్మానియా యూనివర్సిటీ పోరాటల గడ్డమీద ఏర్పడిందన్నారు. అధ్యయనం ఐక్యత పోరాటం అనే నినాదంతో ముందు సాగుతోందన్నారు. ఈ మహాసభ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో వేదిక కాబోతుందన్నారు. ఈ జాతీయ మహాసభలను విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నాల్గు రోజులపాటు జోనల్ స్థాయి క్రీడా పోటీలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని సాంఘీక సంక్షేమ పాఠశాలలలో నాలుగు రోజులపాటు జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమాకళ్యాణి తెలిపారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాళేశ్వరం జోన్ పరిధిలోని పెద్దపల్లి, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు చెందిన పది పాఠశాలల విద్యార్థులు దాదాపు పదమూడు వందల మంది ఈ జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ ఈ నెల 11 నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనబోయే వారందరికి అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయా పాఠశాలలకు చెందిన పీఈటీలు, పీడీలు ప్రిన్సిపాల్‌లు సీనియర్ స్టాఫ్‌తో పాటు ప్రయివేట్ పాఠశాలల నుంచి పిఈటీలను వినియోగించుకుని జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతం చేస్తామని అన్నారు. ప్రజాప్రతినిధులను, అధికారులకు ఈ స్పోర్ట్స్ మీట్‌కు హాజరుకావల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

తహసీల్దార్ ఎదుట ముగ్గురి బైండోవర్

నవతెలంగాణ-జన్నారం

ఆదివారం రాత్రి సమయంలో తాగి జన్నారం బస్టాండ్ వద్ద న్యూసెన్స్ చేసిన పోనకల్ గ్రామానికి చెందిన మహమ్మద్ అవేజ్, మహమ్మద్ తబ్రీజ్, చిలువేరి కార్తీక్‌లను ముగ్గురిపై పెట్టి కేసు విధించి వారి తల్లిదండ్రుల సమక్ష్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి మరల ఇటువంటివి పునరావృతం కాకుండా వారిని స్థానిక తహసీల్దార్ ముందు బైండ్‌ఓవర్ చేసినట్టు ఎస్ఐ రాజ వర్ధన్ తెలిపారు.

ఎస్సార్పీ ఓసీని సందర్శించిన జీఎం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా జీఎంగా బాధ్యతలు స్వీకరించిన సూర్యనారాయణ సోమవారం ఎస్సార్పీ ఉపరితల గనిని సందర్శించారు. మైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు జీఎం ను సాధారణంగా ఆలయంలోకి ఆహ్వానించి పూజా కార్యక్రమాలు నిర్వహించినారు. అనంతరం క్వారీ (ఓసీ) పని స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, గని మేనేజర్ బి బ్రహ్మాజీ రావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగరాజు, సంక్షేమ అధికారి బి.శంకర్ పాల్గొన్నారు. అనంతరం జీఎంను సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ కే బాజీ సైదా పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌లో బొగ్గు ఉత్పత్తి 68 శాతం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో అక్టోబర్ నెలలో 68 శాతం బొగ్గు ఉత్పత్తి అయినట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం సూర్యనారాయణ తెలిపారు. సోమవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూగర్భ గనులలో 82 శాతం ఉత్పత్తి సాధించామని, ఉపరితల గనులలో 63 శాతం ఉత్పత్తి సాధించామని అన్నారు. మిగిలిన నెలల్లో ఆర్థిక సంవత్సరానికి గాను సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమిస్తామన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో గైర్ హాజరు కార్మికులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) అరవింద రావు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-బోథ్



రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం హైదారాబాద్‌లోని గాంధీ భవన్‌లో కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ రమేష్ బత్తుల మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సోషల్ మీడియా ఎన్నికల్లో ప్రధాన పాత్ర పోషిస్తుందని, ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ ప్రతిష్టను పెంచేల చూడాలని సూచించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో సోషల్ మీడియా మరింత కష్టపడి చేయాలన్నారు. కార్యక్రమంలో సోషల్ మీడియా తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ నవీన్, జిల్లా అసెంబ్లీ కోఆర్డినేటర్ రవికిరణ్ రెడ్డి, బోథ్ అసెంబ్లీ కోఆర్డినేటర్‌లు కానిందే దినేష్, నేరేడు కొండ, మండల కోఆర్డినేటర్ పవర్ రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

నవతెలంగాణ-వాంకిడి



మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులు, సిబ్బందికి మహిళలు, పిల్లలపై జరుగుతున్న లైంగిక నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఇన్‌చార్జి సునీత మాట్లాడుతూ మహిళలు, పిల్లల రక్షణ, భద్రత కోసం షీ టీమ్స్ భరోసా సెంటర్ లు పనిచేస్తున్నాయని తెలిపారు. సమస్యలుంటే డయల్ 100, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ డయల్ 1930, మహిళలు, బాలికలను ఎవరైనా వేధిస్తే షీ టీమ్ నంబర్ 8712670564ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు మీనా, ఉపాధ్యాయులు, షి టీమ్ సిబ్బంది స్వప్న, శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-నిర్మల్

కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోదాంను సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్ అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోదాం వద్ద భద్రత సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు. గోదాం నిర్వహణ ఇతర అంశాలపై అధికారులకు పలు కీలక సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, భద్రతా సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

కులగణన సర్వేలో బౌద్ధమతాన్ని నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఈనెల 6 నుండి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణన సర్వేలో ఎస్సీ మహర్ కులస్తులు కాలం నంబర్ 5లో తమ మతాన్ని బౌద్ధ మతాన్ని నమోదు చేసుకోవాలని భారతీయ బౌద్ధ మహాసభ ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు ప్రభాకర్ గడపాలే అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో బౌద్ధ అనుయాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేద్కర్ 14 అక్టోబర్ 1956 నాగపూర్ దీక్ష భూమి కేంద్రంగా 5లక్షల మందితో బౌద్ధ మతాన్ని స్వీకరించారన్నారు. 1990 సంవత్సరంలో మాజీ ప్రధాని వీపీ సింగ్ ప్రభుత్వ హయాంలో బౌద్ధులకు రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. ఎస్సీ మహర్ కులస్తులు బౌద్ధ మతంలో మారిన వారి రిజర్వేషన్ మారదని పేర్కొన్నారు. ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న కులగణన సర్వేలో ఎస్సీ మహర్ కులస్తులు తమ మతాన్ని బౌద్ధ మతంగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉత్తర తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఝాడే ప్రజ్ఞశీల్, జిల్లా కోశాధికారి కాంతరావ్ వాగ్మారే, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి వాగ్మారే కాంరాజ్, భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్వాగ్ సందీప్, లాహుదాస్ సావంత్, కృష్ణ కుమార్ సోన్‌కాంబ్లే, రాజ్ వర్ధన్ మస్కె, లక్ష్మణ్ కాంబ్లే, రాందాస్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బయలుదేరిన విద్యార్థులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేటి నుండి మూడు రోజుల పాటు ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరులో నిర్వహించే గిరిజన ఆశ్రమ పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు సోమవారం బయలుదేరి వెళ్లారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవి జెండా ఊపి బస్సులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలన్నారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనా రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరగనున్న అథ్లెటిక్స్‌తో పాటు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, ఆర్చరీ, టెన్నికాయిట్, చెస్, క్యారం అంశాలలో 126 మంది బాలికలు, 13 మంది బాలురు పాల్గొంటారని, వీరికి గాను 40 మంది ఎస్కార్ట్ వ్యాయామ ఉపాధ్యాయులు మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల నుండి జోన్ 4గా పాల్గొననున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏసీఎంఓ ఉద్ధవ్, జీసీడీఓ శకుంతల, మంచిర్యాల జిల్లా గిరిజన క్రీడా అధికారి బండ జీవరత్నం పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-బోథ్

మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు మల్లెపూల శివారెడ్డిని సోమవారం మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు మేరుగు భోజన్న, ప్రధాన కార్యదర్శి మాసం అనిల్ కుమార్, మాజీ ఎంపీటీసీ కురుమే మహేందర్, నాయకులు బారే నాగేందర్, లాడి గిరీష్, నల్ల శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

6న బంజారా సమావేశం

నవతెలంగాణ-నార్నూర్

ఈనెల 6న జిల్లా కేంద్రంలో నిర్వహించే సమావేశానికి బంజారాలు భారీగా తరలి రావాలని అల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డి నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో బంజారా నాయకులతో సమావేశం నిర్వహించి, మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశానికి అల్ ఇండియా బంజారా సమాజ రాష్ట్ర అధ్యక్షులు రాములు నాయక్ పాల్గొంటునట్టు తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, ప్యాక్స్ ఇన్‌చార్జ్ చైర్మెన్ సురేష్ ఆడే, జేఏసీ మాజీ చైర్మెన్ ఉత్తం రాథోడ్, బంజారా సేవ సంఘం మండలాధ్యక్షులు చంద్రశేఖర్, పెసా చట్టం చైర్మెన్ సికిందర్ రాథోడ్, మాజీ ఉప సర్పంచ్ మహేందర్, వసంత్ ఆడే, ప్రకాష్, జాదవ్ బాలాజీ, సుభాష్ రాథోడ్, జాదవ్ కైలాస్, మాజీ ఎంపీటీసీ రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దీక్షపై కదిలిన ఉన్నతాధికారులు

- నేడు క్షేత్రస్థాయిలో విచారణ
- విజిలెన్స్ పీసీసీఎఫ్ ఎలుసింగ్ మెప్రూా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సిర్పూర్ నియోజకవర్గంలో చర్చకు దారి తీసిన ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆరమణ నిరాహార దీక్షతో అటవీ శాఖ ఉన్నతాధికారులు కదిలారు. విజిలెన్స్ పీసీసీఎఫ్ ఎలు సింగ్ మెప్రూా, విజిలెన్స్ డీఎఫ్ఓ ముకుందరెడ్డితో కలిసి ఆసిఫాబాద్ డీఎఫ్ఓ కార్యాలయంలో జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ సమక్షంలో సిర్పూర్ రేంజ్‌తో పాటు కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు రేంజ్‌ల సిబ్బందిని విచారించారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు రేంజిలలో చెట్లు నరికివేతకు గురవుతున్న అటవీ అధికారులు పట్టించుకోవడంలేదని ఎమ్మెల్యే చేసిన ఆరోపణల నేపథ్యంలో సిబ్బందిని మొదటగా విచారించారు. దీంతో పాటు సిర్పూర్ సంఘటనపై ప్రాథమికంగా విచారణ చేసినట్లు తెలిసింది. అనంతరం మాట్లాడుతూ కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు రేంజ్‌లలో నేడు రెండు టీములుగా సిబ్బంది చెట్ల నరికివేతపై క్షేత్రస్థాయిలో తిరిగి నివేదిక తయారు చేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే దీక్ష శిబిరాన్ని సందర్శించడంతో పాటు ఆయనతో మాట్లాడే ప్రయత్నం చేస్తానని వివరించారు. సిర్పూర్ నిందితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం అవాస్తవమని, పూర్తిస్థాయి విచారణ తర్వాత అన్ని విషయాలు తెలియజేస్తామన్నారు. చెట్లు నరికి వేతకు గురైనట్లు తమ దృష్టికి వచ్చిందని నేడు సమాచారం సరైనదా కాదా అనే విషయం తెలుస్తుందని వివరించారు. ప్రజలు అటవీ అధికారుల విధులకు అడ్డంకులు కలగకుండా చూడాలని కోరారు.

డీఈఓ నిర్లక్ష్యంతో అభ్యర్థులకు అన్యాయం

- వచ్చే డీఎస్సీలో ఖాళీలను చూపాలి
- కలెక్టర్‌కు అభ్యర్థుల వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డీఈఓ నిర్లక్ష్యంతో ఇటీవల డీఎస్సీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని డీఎస్సీ అభ్యర్థులు ఆరోపించారు. ఇటీవల డీఎస్సీలో అన్ని ఖాళీలను ప్రభుత్వానికి పంపించకపోవడంతో జిల్లాలోని డీఎస్సీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, బాధిత అభ్యర్థులు ఆరోపించారు. వచ్చే డీఎస్సీలోనైనా తమను దృష్టిలో ఉంచుకొని పూర్తిస్థాయిలో జిల్లాలో ఉన్నటువంటి ఖాళీలను ప్రభుత్వానికి పంపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా విద్యాశాఖలో రిటైర్‌మెంట్, ప్రమోషన్స్ ద్వారా ఖాళీ అయిన పోస్టులను ప్రభుత్వానికి పంపించాలని కోరారు. అప్పుడే పూర్తిస్థాయిలో ఖాళీలను గుర్తించి, ప్రభుత్వం డీఎస్సీలో అర్హులైన వారికి ఖాళీల ఆధారంగా భర్తీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బాధిత డీఎస్సీ అభ్యర్థులు ఉన్నారు.

కలెక్టర్‌కు రెస్టారెంట్ యజమానుల వినతి

పట్టణంలోని రెస్టారెంట్స్ యజమానులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించే ముందు తమకు ఆహార భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. సోమవారం కలెక్టర్ రాజర్షిషాను ప్రజావాణిలో కలిసి వినతిపత్రం అందజేశారు. దాడుల్లో ఒక్కటి రెండు చోట్ల నాణ్యత లేని కారణంగా దాని ప్రభావం అన్ని రెస్టారెంట్లపై పడుతుందన్నారు. హోటళ్లలో పరిశు భ్రతతో పాటు సామాగ్రి నాణ్యమైనవిగా ఉంచాలని, రెస్టారెంట్‌లో మంచి వాతావరణం ఉంటే కస్టమర్లతోనే ఫిడ్ బ్యాక్ తీసుకోవడం, కిచెన్ చూపించడం లాంటివి చేయాలని కలెక్టర్ యజమానులకు సూచించారు. ఈ సందర్భంగా చాంబర్ ఆఫ్ చామర్స్ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రెస్టారెంట్స్‌పై ఆధారపడి పలు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. తమకు ఆహార భద్రతపై సంబంధిత శాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఆ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా రెస్టారెంట్‌ల యజమానులు ఉన్నారు.

క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటాలి



నవతెలంగాణ-రెబ్బెన

బాల్ బాడ్మింటన్‌లో జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటాలని ఉమ్మడి ఆదిలాబాద్ బాల్ బాడ్మింటన్ ప్రధాన కార్యదర్శి ఆర్ నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం సీనియర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్ బాడ్మింటన్ ఎంపిక పోటీలు మండలంలోని గోలేటి సింగరేణి పాఠశాల గ్రౌండ్‌లో ఎంపిక పోటీలు ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఆయనతో పాటు సింగరేణి పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు ఎమ్ రవితేజ హాజరై క్రీడాకారులను పరిచాయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో అదిలాబాద్ జట్టును ప్రథమ స్థానంలో నిలుపాలని, క్రమశిక్షణతో ఆడాలన్నారు. ఈనెల 8నుండి 10 వరకు హనుమకొండ వరంగల్ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే 70వ అంతర్ జిల్లాల బాల్ బాడ్మింటన్ పోటీలో పురుషులు స్త్రీలు పాల్గొంటారని తెలిపారు. కఠోన సాధన చేసి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో షార్ప్ స్టార్ బాల్ బాడ్మింటన్ అధ్యక్షులు వి.మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎమ్.వెంకటేశ్వర్లు, సింగరేణి పాఠశాల పీఈటీ కె.భాస్కర్, జి.అర్జ రెడ్డి, ఎమ్ చందర్, ఎల్.హరిలాల్, కె.మల్లేష్ పాల్గొన్నారు.

ఎంపికైనా జట్టు ఇదే..

రాష్ట్రస్థాయిలో ఎంపిక పోటీల్లో పాల్గొన్న వారిలో పరుషుల విభాగం నుంచి కె. సిద్దార్థ రాజ్(కెప్టెన్) ఎమ్. తిరుపతి, పి. పవన్ కళ్యాణ్, టి.దిలీప్ కుమార్, కె.నరేష్, పి సాయి చరణ్, కె తరుణ్ సాయి, పి. శ్రీకాంత్, జి. శ్రీధర్,జి. గోపాల్, పి దేవరాజ్, సీహెచ్ గోపాల కృష్ణ ఎంపిక కాగా స్త్రీలు ఏ. స్వప్న, కె. అంజలి, డి శ్రావణి,ఆర్. విష్ణు ప్రియ, కె శ్రీస్ఫూర్తి కారుణ్య, ఎమ్. సహస్ర, పి శ్రావ్య టి. ప్రజ్వలశ్రీ,ఎస్.సాయి, శ్రీ వర్షిణి ఎమ్. శృతిలు ఎంపికైనట్టు నిర్వాహకులు తెలిపారు.

ఐకేపీ వీఓఏల ధర్నా

నవతెలంగాణ-ఆసిఫాబాద్



తమ సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు సీఐటీయూ ఆధ్వర్యంలో మండల సమైక్య కార్యాలయం ఎదుట ధర్నా చేసి ఏపీఎం శ్రీనివాస్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు బుద్దు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకనుగునంగా వేతనాలు రూ.20000 ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, సెర్ప్ నుండి ఐడీ కార్డ్ ఇవ్వాలన్నారు. 11, 12న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్న సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రమ, కోశాధికారి పద్మ, వినోద్, ఫర్జానా, అర్చన, కవిత, సుధీర్, శ్రీధర్, గణేష్, శారద, జయంత్, శంకర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చింది

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆధ్యాత్మికంతో పాటు అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతను గత బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించడమే కాకుండా జిల్లా కేంద్రంలో ఆలయాల నిర్మాణాలు, షెడ్ల నిర్మాణాలకు కోట్ల రూపాయాలను కేటాయించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. సోమవారం పట్టణంలోని శాంతినగర్‌లోని హనుమాన్ ఆలయ కమిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో కేసీఆర్ ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. గ్రామాల్లో ఆధ్యాత్మికత పెంచేలా కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు దేవన్న, బట్టు సతీష్, ఆశన్న, శ్రీనివాస్, సీహెచ్ దినేష్, హనుమాన్లు, వేదవ్యాస్, వెంకటరెడ్డి, కలమడుగు సంతోష్, కృష్ణ, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

మద్దతు ధర కల్పించేందుకే సీసీఐ కొనుగోలు కేంద్రాలు

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్




నవతెలంగాణ-భైంసా

మార్కెట్‌లో పత్తి రైతులకు మద్దతు ధర కల్పించేందుకే కేంద్ర ప్రభుత్వం ద్వారా సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించిందని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. సోమవారం భైంసా మార్కెట్ యార్డులో సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించి మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హయాంలోనే రైతంగానికి మద్దతు ధరలు పెరిగాయాన్నారు. రైతులకు ఇబ్బంది పెట్టవద్దని, అధికారులకు సూచించారు. 12తేమ శాతం ఉంటే క్వింటాలుకు రూ.7,521 ధర ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రయివేట్ మార్కెట్‌లో ధర తక్కువ ఉన్న నేపథ్యంలో, రైతులకు ధర రావాలన్న ఉద్దేశంతో సీసీఐ కొనుగోళ్లపై దృష్టి పెట్టడం జరిగిందన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మెన్ ఆనంద్‌రావ్ పటేల్ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం మార్కెట్ కమిటీ పాలకవర్గం పాటు పడుతుందన్నారు. నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటానని ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్, డైరెక్టర్‌లు, నాయకులు, వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం కేసు నమోదు

నవతెలంగాణ-సిర్పూర్(టి)



మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన సీతారాం(72) అదృశ్యమైన కేసు నమోదు చేశామని ఎస్ఐ కమలాకర్ తెలిపారు. కుటుంబ సభ్యులు, ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతిరోజు మేత కోసం వెళ్లేవాడు. ఇదే క్రమంలో గత నెల 27న రాత్రి కుటుంబ సభ్యులు భోజనం చేసి పడుకొని మరుసటి రోజు ఉదయం 6 గంటలకు మేలుకొని చూడగా లేకపోవడంతో రోజు మాదిరిగానే మేక మేత కోసం వెళ్లాడని భావించారు. సాయంత్రం అయిన రాకపోవడంతో చుట్టుప్రక్కల వారితో పాటు బంధువుల ఇండ్లలో వెతకగా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

వయస్సు పైబడుతున్న తనకు పెళ్లి చేయడం లేదనే కోపంతో సొంత తండ్రినే నరికి చంపిన కొడుక్కి ప్రిన్సిపల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ యావజ్జీవ కారాగార శిక్ష విధించినట్టు నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జానకి షర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్ పట్టణంలోని పింజరిగుట్ట కాలనీకి చెందిన అప్పాల గణపతి(64) అతనికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు కాగా కూతుళ్లిద్దరికి పెండ్లిలు చేశాడు. పెద్ద కొడుకు అభిలాష్ ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉండగా చిన్న కొడుకు నేరస్తుడు అప్పాల అన్వేష్(30) ఏం పని చేయకుండా తల్లి దండ్రుల మీదనే ఆధార పడి జీవించేవాడు. అయితే కొన్ని రోజులులుగా తనకు పెండ్లి చేయమని తన తండ్రిని అడిగాడు. కాగా పెద్ద కొడుకు పెండ్లి చేశాక చేస్తానని తెలిపాడు. దీంతో తండ్రిపై కోపం పెంచుకున్న చిన్న కొడుకు అన్వేష్ తేది13జూన్ 2022న ఉదయం 11 గంటల సమయంలో తన తండ్రితో పెండ్లి గురించి గొడవ పడి కూరగాయల కత్తితో దాడి చేయగా మృతుడు ఇంటి నుంచి బయటకు వచ్చి పడిపోగా అట్టి సంఘటనా చూసి ఆపాడానికి వచ్చిన వారిని బెదిరించి, లోపలికి వెళ్లి కొడవలి తీసుకుని వచ్చి అతి కిరాతకంగా నరికాడు. మృతుని అల్లుడు బోమెడ రాజు ఫిర్యాదు మేరకు అప్పటి నిర్మల్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ ఎన్. శ్రీనివాస్ కేసు నమోదు చేసి నేరస్తున్ని రిమాండ్‌కు తరలించి, చార్జిషీట్ దాఖలు చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నేరస్తుడు అప్పాల అన్వేష్‌కు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమాన విధించారు. నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన వినోద్‌రావు, అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ డల్లు సింగ్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ అంకుశ్ కానిస్టేబుల్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-సిరికొండ

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని చిమ్మన్‌గుడి గ్రామానికి చెందిన జాదవ్ సంతోష్, లలిత రెండో కుమారుడు జాదవ్ విజయ్ సోమవారం సిరికొండ మండల కేంద్రానికి పని నిమిత్తం వచ్చాడు. పనులు పూర్తి చేసుకొని తిరుగు ప్రయాణంలో చిమ్మన్‌గుడి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టాడు. దీంతో కాలు విరిగిపోయి, తలకి తీవ్ర గాయాలయ్యాయి. గమంచిన స్థానికులు 108 ద్వారా ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

ప్రత్యేక తరగతులు ప్రారంభం

నవతెలంగాణ-బోథ్

మండలములోని సొనాల జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో సోమవారం నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేశ్‌ముక్ సచిన్ తెలిపారు. పదవతరగతి పరీక్షలపై ముందస్తుగా ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజు సాయంత్రం సబ్జెక్టు వారీగా గంట పాటుగా ప్రత్యేక తరగతులు కొనసాగుతాయని వివరించారు. విద్యార్థులు ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాన్నారు.

108లో నియామకాలకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈఎంఆర్ఐ 108 సంస్థలు ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఈఎంఈ సతీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈఎంటీ కోసం ఎంఎల్టీ, డీఎంఎల్టీ, జీఎన్ఎమ్, ఏఎన్ఎం బీఎస్సీ (బీజడ్సీ), బీఎస్సీ నర్సింగ్ కోర్సులు చదివినవారు 30 సంవత్సరాలలోపు వయసు గలవారు అర్హులని, ఆసక్తిగలవారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని ఈనెల 7న కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటలకు సంప్రదించాలన్నారు. ఎంపికైన వారు తెలంగాణలో ఎక్కడైనా పని చేయాల్సి ఉంటుందని, ఇతర వివరాల కోసం 9154269804 నెంబర్ సంప్రదించాలన్నారు.

సమస్యలపై కలెక్టర్‌కు వినతులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమస్యలను పరిష్కారించాలని అర్జీదారులు కలెక్టరేట్‌కు పోటేత్తారు. సమస్యలను విన్నవిస్తు దరఖాస్తులను అందించారు. బేల మండల కేంద్రంలో ఇటీవల దండారి ఉత్సవాల చెక్కుల పంపిణీలో ఫోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కలెక్టర్ రాజర్షి షాకు సోమవారం ఫిర్యాదు చేశారు. మున్సిపల్ ఇన్‌చార్జి ఈఈ తిరుపతి అవీనితి పాల్పడుతున్న చర్యలు తీసుకోవడం లేదని మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ, ప్రభుత్వ పాఠశాలల్లో కరాటే శిక్షణకు సంబంధించి కొందరికి అధికారులు వత్తాసు పలుకుతున్నారని కరాటే మాస్టర్స్ ఆరోపించారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ రాజర్షి షాను కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు.

గాలికుంటు వ్యాధి నిర్మూలనకు చర్యలు

నవతెలంగాణ-కెరమెరి



గాలికుంటు వ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని పశువైద్యాధికారి సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని చౌపనుగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి గ్రామంలోనే పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ కోసం టీకాలు వేయించుకోవాలని యజమానులకు సూచించారు. అనంతరం గ్రామంలోని 613 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు సంబంధించిన టీకాలు అందించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సుప్రియ, సిబ్బంది సురేష్ పాల్గొన్నారు.

కౌటాల : మండలంలోని నాగెపెల్లి గ్రామంలో సోమవారం పశు వైద్య అధికారి శ్రీకాంత్ ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో నాలుగు నెలలపై బడిన పశువులు, గేదెలకు ఉచితంగా టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు మూగ జీవాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువుల కు ఎలాంటి వ్యాధులు సోకినా తమకు సమాచారం అందించాన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది సత్యనారాయణ, ప్రకాష్, బిక్షపతి, రైతులున్నారు.